బిబి తోటలో దెబ్బతిన్న వరి కంకులు చూపుతున్న రైతు కొనకళ్ల ప్రసాద్



మోపిదేవి లంకలో కుళ్లిపోతున్న పసుపు దుంపను చూపుతున్న రైతు నాగబాబు



మోపిదేవి వార్పు వద్ద నేలమట్టమైన అరటి తోట



కష్టాలు.. కన్నీళ్లు!

మొంథా తుఫానుతో కుదేలైన అన్నదాతలు



పామర్రులో దెబ్బతిన్న బొప్పాయి తోటను చూపుతున్న కౌలు రైతు మున్నంగి అంజిరెడ్డి (ఇన్‌సెట్‌లో) వర్షానికి పాడైపోయిన మినుము

- జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం
- నేలవాలిన వరి.. మొలకెత్తుతున్న కంకులు
- విరిగిపోయిన అరటి, బొప్పాయి చెట్లు
- నీటిలో నాని కుళ్లిపోయిన పసుపు, కంద
- ఆనవాళ్లు లేకుండా పోయిన మిర్చి, టమాటా, కూరగాయ, ఆకు కూరల పంటలు
- పెనమలూరు నుంచి కోడూరు వరకు అన్ని మండలాల్లో..
- జిల్లాలో 400 కిలోమీటర్లు పర్యటించిన 'ఆంధ్రజ్యోతి' బృందం
- కృష్ణాతీరంలో 'పొలం బాట' పట్టి రైతన్నల కష్టాలు అడిగి తెలుసుకున్న వైనం

6

హంస్పేన్‌పాలెంలో నేలవాలిన వరి



ఆంధ్రజ్యోతి పొలం బాట





పామర్రు మండలం కొండిపర్రు శివారులో దెబ్బతిన్న కంద పంట (ఇన్‌సెట్‌లో) మోపిదేవి లంకలో పసుపు తోటలో నిల్వ ఉన్న నీటిని బయటకు తోడుతున్న రైతు

పుడమి తల్లిని నమ్ముకున్న శ్రమ జీవులు వాళ్లు.. సూర్యోదయానికి ముందే పొలానికి చేరతారు. రోజంతా కష్టపడుతూనే ఉంటారు. చీకటి పడిన తర్వాత గానీ ఇంటికి చేరరు. వారికి ఉన్నది ఒక్కటే వ్యాపకం.. అదే పచ్చని పంటల సాగు.. అటువంటి అన్నదాతలపై తరచూ ప్రకృతి పగపడుతోంది. తుఫాన్లు, వరదల రూపంలో వచ్చి నష్టం కలుగజేస్తోంది. అయినా వెరవక ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. అనేక రకాల పంటలను పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వచ్చిన మొంథా తుఫాను రైతన్నలను కోలుకోలేని దెబ్బతీసింది. కృష్ణానది తీరంలో 'ఆంధ్రజ్యోతి' బృందం జరిపిన 'పొలంబాట' కార్యక్రమంలో భారీగా జరిగిన పంటల నష్టం వెలుగుచూసింది. నదీతీరం ప్రారంభమయ్యే పెనమలూరు నియోజకవర్గం నుంచి కడలిలో కలిసే అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల వరకు సుమారు 400 కిలోమీటర్ల పరిధిలో 'ఆంధ్రజ్యోతి' బృందం సభ్యులు పర్యటించారు. అన్నదాతలు ఎదుర్కొంటున్న కష్టాలను కళ్లారా చూశారు. మొంథా తుఫాను ప్రభావంతో వీచిన గాలులు, భారీ వర్షాలకు వరి, అరటి, బొప్పాయి, పసుపు, కంద, వేరుశనగ, మిర్చి, టమాటా, కూరగాయలు, ఆకు కూరలు ఇలా అనేక రకాల పంటలు నేలపాలయ్యాయి. అరటి, కంద పంటలకు ఎకరానికి రూ.1.50 లక్షలు వరకు నష్టం వాటిల్లింది. మిగిలిన పంటల సాగుకు వేలాల్లో పెట్టుబడులు పెట్టి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నేలవాలిన వరి పంటను మాత్రమే అధికారులు పరిహారం కోసం అంచనా వేస్తున్నారు. దీనిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. 33 శాతం కన్నా అధికంగా పంట నష్టం జరిగినట్లుగా జాబితాలో రాస్తే ఆ తర్వాత ఆ రైతు ధాన్యం కొనుగోలు చేయబోమని వీఏఏలు చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న అన్ని పంటలకు పరిహారం ఇవ్వడంతో పాటు పంటల బీమా కూడా వర్తింపజేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. -(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

సోమవారం రాత్రి మంగినపూడి బీచ్‌లో పర్యటించి అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ బాలాజీ



పౌర్ణమి సముద్ర స్నానాలకు పటిష్ఠ ఏర్పాట్లు

కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సముద్ర స్నానాలకు బుధవారం తెల్లవారుజాము నుంచి వచ్చే భక్తులకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. మంగినపూడి బీచ్‌లో సోమవారం రాత్రి ఆయన మిగతా 6లో..

గన్నవరం సర్పంచ్‌పై వేటు

పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ

- రూ. 1.32 కోట్ల నిధుల దుర్వినియోగమే కారణం
- ఉపసర్పంచ్‌కు తాత్కాలికంగా సర్పంచ్ అధికారాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : గన్నవరం గ్రామపంచాయతీ సర్పంచ్ నిడమర్తి సౌజన్యపై వేటు పడింది. గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం వ్యవహారంలో జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం సర్పంచ్ పదవి మిగతా 6లో..

అంతకుమించి..

వైసీపీ నేత జోగి రమేశ్ అక్రమాల అంతస్థులెన్నో..

- తన ఆస్తి రూ.10 కోట్లు.. అప్పులున్నాయని జోగి ప్రకటన
- అంబాపురంలోని అగ్రిగోల్డ్ భూముల విలువే రూ.25 కోట్లు
- జోగి పీఏ కొన్న భవనం విలువ రూ. 1.30 కోట్లు
- అవికాక మైలవరం, హైదరాబాద్‌లో భూముల కొనుగోలు
- నకిలీ మద్యం వ్యాపారంతోనే కొన్నారా? అనే అనుమానాలు



ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి పీఏ కొనుగోలు చేసిన భవనం (ఇన్‌సెట్‌లో) జిల్లా జైలు వద్ద జోగి రమేశ్

కల్తీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ఆస్తుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తనకు రూ.10 కోట్ల ఆస్తులే ఉన్నాయని ప్రకటించుకున్న ఆయన రూ.25 కోట్లు పెట్టి అంబాపురంలో అగ్రిగోల్డ్ ఆస్తులు కొన్నారా? లేదా ఆక్రమించుకున్నారా? అనే అనుమానాలతో పాటు ఆయన బినామీల ఆస్తులు, మంత్రిగా ఉన్న సమయంలో కొన్న స్థలాల లెక్కలు తీస్తే ఆశ్చర్యం కలగకమానదు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తనకు రూ.10 కోట్ల ఆస్తులే ఉన్నాయంటున్న మాజీమంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ కుటుంబం అంబాపురంలో రెవెన్యూ-సీఐడీ నిర్ధారించిన అగ్రిగోల్డ్ భూములను ప్రైవేట్ వ్యక్తి వద్ద కొన్నామని చెబుతోంది. కొద్దిరోజుల ముందు ఓ టీవీ చానల్‌లో జోగి రమేశ్ ఈ విషయం చెప్పడం విడ్డూరంగా ఉంది. ఈ అగ్రిగోల్డ్ భూముల విలువ రూ.25 కోట్ల వరకు ఉంటుంది. రూ.10 కోట్ల ఆస్తులు కలిగి, చాలా అప్పులు ఉన్నాయని చెబుతున్న జోగి రమేశ్‌కు రూ.25 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయన్నది చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల అఫిడవిట్ లెక్కలు తప్పా..?

2024 ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘానికి ఇచ్చిన అఫిడవిట్‌లో తాను, తన భార్య స్థిరచరాస్తులన్నీ కలిపి రూ.4 కోట్లుగా జోగి రమేశ్ చూపారు. అప్పులు మాత్రం అంతకుమించే ఉన్నట్టు తెలిపారు. ఇలాంటపుడు జోగి రమేశ్ తనకు రూ.10 కోట్ల మేర ఆస్తులు ఉన్నాయని తాజాగా చెప్పడం ఎన్నికల సంఘానికి కూడా తప్పుదారి పట్టించినట్టే అవుతుంది. జోగి రమేశ్ గతంలో ఒక పాత పెంకుటిల్లులో ఉండేవారు. రూ.10 కోట్లతో ఆధునిక భవనాన్ని ఎలా సమకూర్చుకున్నారో? ఆయనే చెప్పాలి. ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చింది? అంటే నకిలీ మద్యం వ్యాపారం నుంచే వచ్చిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అగ్రిగోల్డ్ భూములు కొన్నారా? కొట్టేశారా?

అంబాపురంలోని అగ్రిగోల్డ్ భూములను కొనకుండా తప్పుడు డాక్యుమెంట్లు, ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని జోగి రమేశ్‌పై అభియోగం. తాను అసలు భూములే అమ్మలేదని పోలవరపు మురళీమోహన్ అనే వ్యక్తి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. జోగి రమేశ్ మాత్రం ఇప్పటికీ తాము మిగతా 6లో..

అక్రమంగా ఉమ్మడి స్థలాల విక్రయాలు

8

కలెక్టర్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

- కుటుంబ కలహాలే కారణం
- ప్రభుత్వ తప్పిదం లేదన్న కలెక్టర్



ఎన్‌హెచ్-16పై పడిన కంకరను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఇన్‌సెట్‌లో) ఇబ్రహీంపట్నంలో అధిక లోడుతో పట్టా కూడా లేకుండా వెళ్తున్న టిప్పర్



టిప్పర్లతో తిప్పలు

ప్రమాదకరంగా భారీ టిప్పర్లు, హెవీ డంపర్లు

- ఓవర్ లోడుతో పాటు జాగ్రత్తలు లేకుండా రాకపోకలు
- మితిమీరిన వేగంతో ప్రయాణం.. రాత్రుళ్లు మరీ ఘోరం
- జిల్లావ్యాప్తంగా అనేక ప్రమాదాలు.. పట్టని అధికారులు
- ప్రధాన రహదారులపై పడిపోతున్న కంకర, ఇసుక
- వేగంగా వచ్చి పడిపోతున్న వాహనదారులు
- జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు గ్రామీణ రోడ్లూ ఛిద్రం

ఓవర్ లోడుతో వెళ్తున్న టిప్పర్లు, డంపర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. తెలంగాణాలోని చేవెళ్లలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో మన జిల్లాలో పరిస్థితులను పరిశీలిస్తే.. జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు గ్రామీణ రోడ్లలోనూ ఇవి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇసుక, కంకర, మట్టి, గ్రావెల్ ఏదైనా.. అధిక లోడుతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా అత్యంత వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రిపూట మరింత వేగం పుంజుకుంటున్నాయి. సరైన ఆజమాయిషీ లేకపోవటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/కంచికచర్ల/విజయవాడ రూరల్/హనుమాన్ జంక్షన్ రూరల్) : విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్-65, ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ ఎన్‌హెచ్-30పై నిత్యం భారీసంఖ్యలో కంకర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, జి.కొండూరు మండలాల్లోని వందలాది రాతి క్వారీలు, సమీపంలోని పెద్దపెద్ద క్రషర్ల నుంచి మిగతా 6లో..



పెనమలూరులో నేలకొరిగిన కంద పంటను చూపుతున్న రైతు

కష్టం..నష్టం..!



బంటుమిల్లి మండలం నారాయణపురంలో నేలకొరిగిన వరి

మొంథా తుఫాను రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. తుఫాను ప్రభావంతో బలమైన గాలుల తీవ్రతకు వరిపంటతోపాటు అరటి, పసుపు, కంద తోటలకు తీవ్రనష్టం వాటిల్లింది. మిర్చి, టమాటా మొక్కలను ఇరవైరోజుల క్రితం నాటగా తోటల్లోకి వర్షపునీరుచేరి బయటకు వెళ్లే దారిలేక చనిపోతున్నాయి. మొంథా తుఫాను రైతులకు మిగిల్చిన నష్టం, వారి కష్టాలు తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' బృందం 'పొలంబాట' కార్యక్రమాన్ని సోమవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించింది. 20మంది విలేకరుల బృందం 26 మండలాల్లోని పలు గ్రామాల్లో 400కిలోమీటర్ల మేర పర్యటించి రైతులకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకోవడం జరిగింది.

- ఈతదశలో ఉన్న వరి సుంకురాలి తెల్లకంకులు ఏర్పడినా పంట నష్టపరిహారం జాబితాలో నమోదు చేయరట
- జాబితాలో నమోదుచేస్తే ధాన్యం కొనుగోలు చేయరని చెబుతున్న వీఏఏలు
- అరటి, కంద పంటలకు బీమా సౌకర్యమే లేదు
- 50శాతంకు పైగా వరిపంటకు నష్టమని చెబుతున్న వ్యవసాయ సీనియర్ శాస్త్రవేత్తలు
- అన్నిపంటలకు బీమా, నష్టపరిహారం ఇవ్వాలని రైతుల వేడుకోలు
- కృష్ణాజిల్లాలో 'ఆంధ్రజ్యోతి-పొలంబాట'లో వెలుగుచూసిన రైతుల కష్టాలు

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

అరటి రైతుకు కోలుకోలేని నష్టం

మొంథా తుఫాను తీరందాటే సమయంలో జిల్లాలోని అన్నిప్రాంతాల్లో గంటకు 90కిలోమీటర్ల కంటే వేగంగా గాలులు వీచాయి. ఈ గాలుల ప్రభావానికి పిలకతోటలతో



మోపిదేవిలంకలో పూర్తిగా పడిపోయిన అరటితోటలు

పాటు, గెలలు తయారై కోతకు సిద్ధంగాఉన్న అరటిచెట్లు నిలువునా కూలిపోయాయి. ఎకరానికి పెట్టుబడిగా రూ.50వేలు, కౌలుగా రూ.50వేలుగా ఇప్పటివరకు రైతులు పెట్టారు. అరటిగెలలు కోతదశలో ఉన్న సమయంలో చెట్లు మొత్తంగా పడిపోవడంతో పూర్తిస్థాయిలో నష్టపోయామని రైతులు చెబుతున్నారు. విరిగిపడిన చెట్లను తొలగించేందుకు ఎకరానికి కనీసంగా రూ.15వేలు ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. ఎకరానికి రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని, దీనికితోడు చెట్లు పడిపోకుండా కట్టిన వాసాలు సైతం విరిగిపోయాయని రైతులు చెబుతున్నారు. అరటిపంటకు బీమా సౌకర్యం లేదని రైతుల మాటగా ఉంది.

కంద దిగుబడి తగ్గడం ఖాయం..

కంద పంట మరో నెలరోజుల్లో తీస్తామని, ఈదశలో పెనుగాలులకు మొక్కలు విరిగిపడి చనిపోయాయని, దీంతో దుంపలకు ఆహారం అందదని రైతులు చెబుతున్నారు. ఎకరానికి కంద దిగుబడి 70పుట్లు(ఒకపుట్టుకు250 కిలోలు) వస్తుందని ఆశించామని, తుఫాను కారణంగా దిగుబడి సగానికి సగం తగ్గుతుందని, కందలో నాణ్యత తగ్గితే ధరకూడా ఆశించినమేర రాదని రైతులు అంటున్నారు. రానున్నరోజుల్లో కంద పుట్టు ఎంతమేర ధర పలుకుతుందో చూడాలని రైతులు చెప్పుకుంటున్నారు. ఎకరం కంద సాగుకు కౌలుతో కలిపి రూ.1.50లక్షల వరకు ఖర్చు అవుతుందని, అంతా బాగుంటే రూ.3.50నుంచి 4లక్షలవరకు వస్తుందని ఆశించామని, అయితే కోలుకోలేని దెబ్బతగిలిందని, భూమి ఆరిన తరువాత పంటను తవ్వి విక్రయిస్తే నష్టం ఎంతమేర వస్తుందో తేలుతుందని రైతులు అంటున్నారు.

పసుపు దిగుబడి పైనా సన్నగిల్లుతున్న ఆశలు

జూన్‌నెలలో జిల్లాలో పసుపు 2,200హెక్టార్లవరకు నదీ తీరం వెంబడి గ్రామాల్లో, లంకభూముల్లో సాగుచేశారు. పసుపుపైరు నాలుగున్నర నెలలు, ఐదు నెలలవయసులో ఏపుగా ఎదిగి దుంపకట్టే దశలో ఉంది. తుఫాను ప్రభావంతో వీచిన గాలులకు ఏపుగా ఎదిగిన పసుపు మొక్కలు



విరిగిపోయాయి. ఇలా విరిగిన మొక్కలు దుంపలకు ఆహారం అందించలేవని, పక్కనే పిలకలు వచ్చినా, వాటితో అంతగా ఉపయోగం ఉండదని రైతులు అంటున్నారు దీంతోపాటు రోజుల తరబడి పసుపుతోటలో నీరు నిల్వఉండటంతో తయారయ్యే దశలో ఉన్న దుంపలు భూమి లోపలే కుళ్లిపోతున్నాయని, వాసనవస్తున్నాయని, దీంతో ఎంతమేర నష్టం జరుగుతుందనేది ఇప్పుడే చెప్పలేమని రైతులు అంటున్నారు. ఎకరానికి సరాసరి 35నుంచి40క్వింటాళ్ల పసుపు దిగుబడి వస్తుందని ఆశించామని, ఈ ఏడాది పసుపు ఎంతమేర దిగుబడివస్తుందో చెప్పలేకున్నామని రైతులు అంటున్నారు. ప్రభుత్వం బీమా ఇస్తేనే కోలుకుంటారని రైతులు అంటున్నారు.

రైతుల డిమాండ్లు

- మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న అన్ని పంటలకు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు పంటల బీమా అమలు చేయాలి
- కందపంటకు ఇంతవరకు బీమా, నష్టపరిహారం ఇవ్వడం లేదు. ఈ ఏడాది నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల బీమా జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలి.
- అరటికి పంటబీమా గతఏడాది వరకు జిల్లాలో అమలు చేశారు. ఈ ఏడాది జిల్లాను మినహాయించారు. రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయిన అంశాన్ని దృష్టిలో ఉంచుకుని బీమా అమలుచేసి ఆదుకోవాలి.
- పసుపుపంటకు దిగుబడి ఆధారంగా బీమాను ఈ ఏడాది అమలు చేస్తున్నారు. అది కూడా జిల్లా యూనిట్‌గా అమలులో ఉంది, వాతావారణం ఆధారంగా పసుపుపంటకు గ్రామం యూనిట్‌గా బీమా అమలు చేయాలి.
- మొంథా తుఫాను కారణంగా బలమైన గాలులకు వరికంకులు పాలుపోసుకునే దశలో ఉండి గింజలు పగిలిపోయి తప్పతాలుగా మారాయి. దెబ్బతిన్న పంటను పూర్తిస్థాయిలో నష్టపరిహారం జాబితాలో నమోదు చేయాలి.

మొక్కదశలోనే మిర్చి, టమాటా తోటలకు దెబ్బ

కృష్ణాతీరం వెంబడి లంకగ్రామాల్లో మిర్చి, టమాటాసాగును 20 నుంచి నెలరోజుల్లోపు సాగుచేశారు. ఎకరానికి మిర్చిమొక్కలు 18వేలు, టమాటా మొక్కలు 14వేల చొప్పున, ఒక్కోమొక్క రూపాయితో కొనుగోలు చేసి నాటారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తోటల్లో నీరు నిలబడి నిలదొక్కుకునే దశలో ఉన్న మొక్కలు చనిపోయాయి, మిర్చి, టమాటాసాగుకు దుక్కి, ఎరువులకు, మొక్కలు నాటేందుకు మొత్తంగా ఎకరానికి ఇప్పటికి రూ.25వేలు ఖర్చయిందని, ఈ పెట్టుబడి మొత్తం నీటిలో పోసినట్టయిందని రైతులు వాపోతున్నారు. గతంలో రూపాయి పలికిన మిర్చి, టమాటా ఒక్కో మొక్కధరను ఇప్పుడు నర్సరీ యజమానులు ఒక్కోటి రెండురూపాయలకు పెంచారని రైతులు చెబుతున్నారు.

పంట నష్టపరిహారం నమోదుపై స్పష్టత ఏదీ

జిల్లాలో 45వేల హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పంట నష్టపరిహారం జాబితాలు తయారుచేసే సమయంలో నేలావాలిన పంటను మాత్రమే నష్టపరిహారం జాబితాలో నమోదు చేస్తామని, ఈతదశలో ఉండి సుంకురాలిపోయిన పంటను నమోదు చేయమని గ్రామస్థాయిలో వ్యవసాయ అధికారులు(వీఏఏ) చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఈతదశలో ఉన్న వరిపంట బలమైన గాలుల కారణంగా సుంకురాలి గింజలు పగిలిపోయి తెల్లకంకులుగా మారాయని, ఇలాఉంటే నష్టపరిహారం జాబితాల్లో రాయాలని తమకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని, తాము ఏమీ చేయలేమని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారని రైతులు చెబుతున్నారు. పంట నష్టపరిహారం జాబితాల్లో 33శాతంకన్నా అధికంగా పంట నష్టం జరిగినట్టుగా రాస్తే, సంబంధిత పంటను కొనుగోలు చేయకుండా ఈ-క్రాప్‌లో బ్లాక్‌లో పెడతారని వీఏఏలు చెబుతున్నారని రైతులు అంటున్నారు. కొందరు వీఏఏలు ఇంతవరకు గ్రామాల్లోకి వచ్చి పంటకు జరిగిన నష్టాన్ని కూడా పరిశీలించలేదని రైతులు అంటున్నారు.

50 శాతానికి పైగావరిపంటకు నష్టం

తుఫాను అనంతరం గుంటూరు లాంఫాం, ఘంటసాల వ్యవసాయ పరిశోధనాక్షేత్రానికి చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు జిల్లాలోని పలుప్రాంతాల్లో పర్యటించి వరిపంటను పరిశీలించారని, పాలుపోసుకునే దశలో వరిపంట ఒకదుబ్బులో ఉన్న తల్లి, పిల్లకర్రలకు ఉన్న గింజలు పగిలిపోయాయని, ఇవి తప్పతాలుగా మారిపోతాయని, వరి పంట 50శాతం దెబ్బతిందని తమతో చెప్పారని రైతులు అంటున్నారు. కానీ వరిపంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వరితో పాటు కంద, అరటి, పసుపు పంటలకు పంటబీమా వర్తింపచేయాలని, పంట నష్టపరిహారం కూడా ఇవ్వాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



చేతికొచ్చే సమయంలో నష్టం

కొనకళ్ల ప్రసాద్, బి.వి.తోట, రైతు

వారం పదిరోజుల్లో చేతికొచ్చే పంట తుఫాను కారణంగా సర్వనాశనం అయ్యింది. ఈ ఏడాది సకాలంలో నాట్లు పడ్డాయి. 40 బస్తాలు పండుతుందని ఆశించాం. తుఫాన్‌తో ఆశలు అడియాశలయ్యాయి.

ఊహించని నష్టం



- వెంకటేశ్వరరావు, చిట్టిపాలెం

తుఫాన్ నష్టం ప్రభావం ఇంత అంతా కాదు. ఊహించని విధంగా దెబ్బ తీసింది. పంట మొత్తం మునిగిపోయింది. పది ఎకరాల్లో చేతికొచ్చేది అంతంత మాత్రమే. చేసిన ఖర్చుకు తోడు, పడి పోయిన పంటను లేవదీసి కోతలు కోసేందుకు ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి.

పంట పూర్తిగా పోయింది

- జన్ను వెంకటేశ్వరరావు, సీతారామపురం



12 ఎకరాలు కౌలు చేస్తున్నా. తుఫానుకు పంట మొత్తం పడిపోయింది. రెండో పంట ఉంటే సిద్దమవుతాం. పంట నూర్చే పరిస్థితి లేదు. యంత్రాలకే చాలా ఖర్చు అవుతుంది. పొలంలోనే వదిలేస్తా.

నష్టం నమోదు చేయడం లేదు

- నల్లూరి గంగాధర్‌రావు, శ్రీకాకుళం



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరా ఒక్కింటికి రూ.25 వేల మేర నాలుగు ఎకరాలకు లక్ష వరకు ఖర్చు అయ్యింది. తుఫాన్ కారణంగా అత్యధిక శాతం తెల్లకంకులు కనిపిస్తుండటంతో ఏమి చేయాలో అర్థం కావటం లేదు. పడిపోకుండా నిలబడి ఉన్నప్పటికీ కంకులు పాలు పోసుకోకుండా తప్పలుగా ఉన్నాయి. ఇలాంటి పొలాల విషయంలో అధికారులు నష్టం జరిగినట్లు నమోదు చేయటం లేదు.

పెట్టుబడి రావడం గగనమే

- నడకుదుటి సీతారామరాజు, నిమ్మగడ్డ



రెండు ఎకరాల్లో కంద వేయగా, ఎకరాకు రూ.2.50 లక్షల మొత్తాన్ని విత్తనాల కోసం, రూ.50 వేల మేర సాగు మొత్తం రూ.6 లక్షల మేర ఖర్చు చేశా.. ప్రకృతి సహకరించి ఉంటే ఎకరా ఒక్కింటికి రూ.5 లక్షలు వచ్చేది. గాలుల కారణంగా ఏపుగా పెరిగిన కంద చెట్లు విరిగి పడిపోవటంతో ఇప్పటి వరకు పెరిగిన దుంప మాత్రమే దక్కుతుంది. పెట్టుబడి ఖర్చులు కూడా రావటం గగనం అవుతుంది.

న్యాయం చేయాలి

- ఇంకొల్లు చెన్నయ్య, కె.కొత్తపాలెం



తుఫాన్ కారణంగా వరి పంట దెబ్బతిన్న రైతులకు నిబంధనలు సడలించి రైతులకు న్యాయం చేయాలి. తుఫాను నష్టం జాబితాలో వరి పంటను నమోదు చేస్తే ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు పడతారని చెబుతున్నారు. ఆ మేర కు నిబంధనలు సడలించి పంట దెబ్బతిన్న రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి.

అధికారులు న్యాయం చేయాలి

- కాగిత వెంకట్రావు, అర్తమూరు



సాతులూరు రోడ్డులో ఎకరం అరవై సెంట్లు దేవుడిమాన్యం కట్టుబడి చేస్తున్నాం. దేవస్థానం భూములకు సంబంధించి కాగితాలు ఇవ్వకపోవడంతో అధికారులకు సమర్పించలేక పోయా. మరోచోట రెండు ఎకరాలు కౌలు చేస్తున్నా. 65 సెంట్లకు మాత్రమే కౌలుకార్డు ఉంది. దాదాపు మూడు ఎకరాలకు ఎలాంటి ఆధారం లేకపోవడంతో ప్రభుత్వ సాయం అందేలా లేదు. అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలి.

వాణిజ్య పంటలకు అపార నష్టం

- బొందలపాటి వెంకటేశ్వర ప్రసాద్, మోపిదేవి



అధిక వర్షాలు, తుఫాను కారణంగా వాణిజ్య పంటలైన అరటి, పసుపు, కంద, కూరగాయల తోటలు సాగు చేస్తున్న రైతులకు అపార నష్టం వాటిల్లింది. ప్రస్తుతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అరటి పంటకు మాత్రమే అధికారులు అంచనా నమోదు చేస్తున్నారు. పసుపు, కంద పంటలకు నష్టం అంచనాలో పొందుపరచి రైతులకు న్యాయం చేయాలి. ప్రభుత్వమే ఆదుకుని న్యాయం చేయాలి.

పదిలక్షలకు పైగా నష్టపోయా

- మన్నె రాజబాబు, తాడిగడప

తాడిగడప గ్రామాన్ని ఆనుకొని ఉన్న తన పొలంలో ఐదెకరాల్లో అరటి, మరో ఐదెకరాల్లో కంద సాగు చేశాను. అరటి చెట్లు గెలలతో నేలకొరిగి పూర్తిగా ధ్వంసమయింది. కంద దుంప పూర్తిగా రాకుండానే కొంతమేర నష్టం వాటిల్లింది. దీంతో పది లక్షలకు పైగా నష్టపోయానని రైతు, స్థానిక టీడీపీ నేత మన్నె రాజబాబు వాపోయాడు.

ఆ ఇద్దరికీ జీవిత ఖైదు సరైనదే!

- ట్రయల్ కోర్టు తీర్పునకు హైకోర్టు సమర్థన
- చిన్నారి నాగ వైష్ణవి కిడ్నాప్, హత్య కేసులో
- ట్రయల్ ఉత్తర్వులకు పాక్షిక సవరణ
- ఇద్దరు దోషుల అప్పీళ్లు కొట్టివేత
- మరొకరిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు
- 15ఏళ్ల క్రితం బెజవాడలో సంచలనం రేపిన కేసు



నాగవైష్ణవి (ఫైల్)

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పదిహేనేళ్ల క్రితం సంచలనం సృష్టించిన చిన్నారి పలగాని నాగవైష్ణవి కిడ్నాప్, హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ మహిళ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు పాక్షికంగా సవరించింది. నిందితులు మోర్ల శ్రీనివాసరావు(ఏ1), యంపరాల జగదీశ్(ఏ2)లకు ట్రయల్ కోర్టు విధించిన శిక్షను సమర్థిస్తూ వారు వేసిన అప్పీళ్లను కొట్టివేసింది. సరైన సాక్ష్యాలు లేనందున మరో నిందితుడు పంది వెంకటరావు అలియాస్ కృష్ణ(ఏ3)కు విధించిన జీవిత ఖైదును రద్దు చేస్తూ, అతడిని నిర్దోషిగా ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డితో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు ఇచ్చింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 2010లో.. విజయవాడలో చిన్నారి నాగ వైష్ణవి, కారు డ్రైవర్ లక్ష్మణరావు హత్యకేసు సంచలనం సృష్టించింది. విజయవాడకు చెందిన పలగాని ప్రభాకర్‌రావుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య పలగాని వెంకటేశ్వరమ్మకు పిల్లలు లేకపోవడంతో నర్మదాదేవిని రెండో పెళ్లి చేసుకోగా ఇద్దరు కుమారులు, కుమార్తె నాగవైష్ణవి జన్మించారు. కుమార్తె పుట్టిన తరువాత వ్యాపారం వృద్ధి చెందడంతో ప్రభాకర్‌రావు ఆమె పేరుమీద ఆస్తులు కొనడం ప్రారంభించారు. దీంతో కుటుంబంలో విభేదాలు ప్రారంభమయ్యాయి. అక్క వెంకటేశ్వరమ్మకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని సోదరుడు పంది వెంకట్రావు బావపై కక్ష పెంచుకున్నాడు. నాగవైష్ణవిని హత మారిస్తే అక్క కాపురం బాగుపడుతుందని భావించి హత్యకు కుట్రపన్నాడు. బంధువు మోర్ల శ్రీనివాసరావుతో రూ.50లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. శ్రీనివాసరావు తన వద్ద పనిచేసే జగదీశ్ సాయం తీసుకున్నాడు. నాగవైష్ణవి, సోదరుడు తేజేశ్ గౌడ్‌లను డ్రైవర్ లక్ష్మణరావు 2010 జనవరి 30న ఉదయం పాఠశాలకు తీసుకెళ్తుండగా మోర్ల శ్రీనివాసరావు రాయి విసిరి కారు అద్దం పగులగొట్టాడు. డ్రైవర్ లక్ష్మణరావు దిగి చూస్తుండగా మోర్ల శ్రీనివాసరావు, జగదీశ్.. అతడిని కత్తులతో విచక్షణారహితంగా పొడిచారు. ఇది గమనించి తేజేశ్ గౌడ్ కారుదిగి పారిపోయాడు. డ్రైవర్ లక్ష్మణరావును స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. శ్రీనివాసరావు, జగదీశ్ చిన్నారి వైష్ణవిని కిడ్నాప్ చేసి మరో కారులో తరలిస్తుండగా చిన్నారి కేకలు వస్తుండటంతో గొంతు నొక్కి చంపేశారు. ప్లాస్టిక్ డ్రమ్ములో మృతదేహాన్ని ఉంచి గుంటూరు శివారులోని ఆటోనగర్‌లో విద్యుత్ కొలిమిలో వేసి బూడిద చేశారు. కుమార్తె హత్యతో తండ్రి ప్రభాకర్‌రావు గుండె ఆగి మరణించారు. కేసు ట్రయల్ జరుగుతుండగానే నాగవైష్ణవి తల్లి నర్మదాదేవి, బాబాయి మరణించారు. హత్య ఘటనపై విజయవాడ పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ జరిపిన విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు నిందితులు మోర్ల శ్రీనివాసరావు, యంపరాల జగదీశ్, పంది వెంకటరావులకు 2018జూన్ 14న జీవిత ఖైదు విధించింది. తీర్పును సవాల్ చేస్తూ దోషులు వేర్వేరుగా హైకోర్టులో అప్పీల్ వేశారు. దీనిపై ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపి పై విధంగా తీర్పు చెప్పింది.

టిప్పర్లతో తిప్పలు

(5వ పేజీ తరువాయి)

రాత్రీ పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో టిప్పర్లు పలు గ్రామాలకు కంకరను రవాణా చేస్తున్నాయి. టిప్పర్లలో కంకరను ఓవర్ లోడు చేస్తున్నారు. డ్రైవర్ టాప్ క్యాబిన్‌పై కూడా కంకరను పోసి మరీ రవాణా చేస్తున్నారు. కంకర కిందకు కారకుండా ఉండేందుకు పట్టాలు కూడా కట్టట్లేదు. ఈ క్రమంలో జాతీయ రహదారుల్లోని పలు కూడళ్ల వద్ద, జంక్షన్లు ఉన్నచోట కంకర కింద పడుతోంది. పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న జంక్షన్లలో, రింగ్ సెంటర్లలో రోజూ 4 నుంచి 5 ట్రాక్టర్ల మేర టిప్పర్ల నుంచి కంకర కింద పడుతోంది. వీటివల్ల వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి.

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో..

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇసుక రీచ్‌లు, గ్రావెల్, కంకర క్వారీలు, సిమెంట్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడి నుంచి జిల్లాలోని ప్రాంతాలకే కాకుండా, ఇతర జిల్లాలకు ఇసుక, కంకర, సిమెంట్ సరఫరా అవుతుంది. టిప్పర్లు, డంపర్లలో పరిమితికి మించి లోడ్ చేస్తున్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం ఆరు టైర్ల టిప్పరుకు 10 టన్నులు, 10 టైర్లకు 18 టన్నులు, 12 టైర్లకు 26 టన్నులు, 14 టైర్లకు 32 టన్నుల మేర లోడింగ్ చేయాలి. అదే డంపర్‌కు అయితే 35 టన్నుల వరకు లోడ్ చేసుకోవచ్చు. కానీ, టిప్పర్లు, డంపర్ల యజమానులు ఓవర్ లోడింగ్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. భారీ టిప్పర్లకు, డంపర్లకు 60 నుంచి 70 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు. వీటివల్ల జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు ధ్వంసమవుతున్నాయి.

నగరంలో రాత్రిపూట ఇష్టానుసారంగా..

టిప్పర్ల దూకుడు కారణంగా నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు, పైపులరోడ్డు సెంటర్, ప్రకాష్‌నగర్, కండ్రిక తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అవనిగడ్డ-విజయవాడ కరకట్ట మార్గం మీదుగా ఇసుకతో కూడిన భారీ లారీలు గుంటూరు కూడా వెళ్తున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట హెవీలోడుతో ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65పై గంటకు వంద కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకెళ్తున్నాయి. కొంతమంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గన్నవరం, బాపులపాడు మండలాల్లోని క్వారీల నుంచి కూడా నగరానికి మితిమీరిన వేగంతో టిప్పర్లు దూసుకొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కంటితుడుపు చర్యలు కాకుండా తగు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలతో పాటు రహదారులు ధ్వంసం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది.

పెద్దపెద్ద రాళ్లు రవాణా

ఒకపక్క కంకరతోనే ఇబ్బందులు పడుతుంటే.. భారీ బండరాళ్లను సైతం ఎలాంటి జాగ్రత్తలు లేకుండా టిప్పర్లలో రవాణా చేసేస్తున్నారు. క్వారీల్లో నుంచి పెద్దపెద్ద రాళ్లను ఎలాంటి రక్షణ లేకుండా రవాణా చేస్తున్నారు. ఆ రాళ్లు ఎప్పుడు మీద పడతాయోనని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు.

సముద్ర స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఆర్డీవో స్వాతి, మత్స్య శాఖ జేడీ నాగరాజ, డీపీవో అరుణ, ఆర్టీసీ డీఎం పెద్దిరాజులు, డీఎంహెచ్‌వో యుగంధర్‌తో కలిసి పర్యటించారు. విద్యుత్ దీపాలు, మరుగుదుడొడ్లు, తాగునీరు, వాహనాల పార్కింగ్, గజ ఈతగాళ్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. పెదపట్నం వద్ద కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ ఆరు వాచ్ టవర్లు, పది డ్రోన్లు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

హాకీ శతాబ్ది వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హాకీ శతాబ్ది వేడుకలకు కలెక్టర్ డీకే బాలాజీ శ్రీకారం చుట్టారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో హాకీ శతాబ్ది వేడుకల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గూడూరు జడ్పీ హైస్కూల్‌లో నవంబర్ 7న శతాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జేసీ నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జహిద్, ఆర్డీవో స్వాతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

శివోహం



లక్ష్మీపురంలో అర్ధనారీశ్వరునిగా సోమేశ్వరస్వామి

కార్తీక మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో అర్ధనారీశ్వరునిగా స్వామివారు దర్శనమిచ్చారు. గుడివాడ పట్టణంలోని శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వత్తులు వెలిగించారు.



గుడివాడలోని శివాలయంలో వత్తులు వెలిగిస్తున్న భక్తులు

గన్నవరం సర్పంచ్‌పై వేటు

(5వ పేజీ తరువాయి)

నుంచి ఆమెను తొలగిస్తూ కలెక్టర్ బాలాజీ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. సర్పంచ్ అధికారాలను తాత్కాలికంగా ఉపసర్పంచ్‌కు బదిలీ చేశారు. గన్నవరం పంచాయతీలో రూ.1.32 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగిందని జిల్లా అధికార యంత్రాంగం నిర్ధారించింది. గ్రామ కార్యదర్శితో కలిసి నిధులను దుర్వినియోగం చేసినట్టుగా విచారణలో తేలింది. పంచాయితీ రాజ్ చట్టాన్ని అనుసరించి సర్పంచ్, కార్యదర్శి ఇద్దరికి 1:1 నిష్పత్తి ప్రకారం ఇద్దరూ రూ.66,05,425 చెల్లించాలని, లేని పక్షంలో సర్పంచ్ పదవి నుంచి తొలగించాల్సి ఉంటుందని గతంలో నోటీసు ఇచ్చారు. ఈ డబ్బులు చెల్లించడానికి ఆరు నెలల సమయం ఇచ్చారు. ఈ ఆరు నెలల కాలంలో సర్పంచ్ చెక్కు డ్రాయింగ్ అధికారాలను కూడా నిలిపివేశారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, 14వ ఆర్థిక సంఘం నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులను డ్రా చేసే అధికారాన్ని గుడివాడ డీఎల్‌పీవోకు అప్పగించడం జరిగింది. దీనిపై సర్పంచ్ నిడమర్తి సౌజన్య కలెక్టర్‌కు అప్పీలు చేసుకున్నారు. జూలై 19, 2024న నిడమర్తి సౌజన్య కలెక్టర్ ఎదుట వ్యక్తిగతంగా హాజరై లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. సర్పంచ్ చేసిన అప్పీలుపై కలెక్టర్ రికార్డులను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా గుడివాడ డీఎల్‌పీవోను ఆదేశించారు. గుడివాడ డీఎల్‌పీవో విచారణ జరిపి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో సర్పంచ్ చెక్ డ్రాయింగ్ పవర్‌ను నిషేధిస్తూ, డబ్బులు చెల్లించడానికి మరో మూడు నెలలు సమయం ఇచ్చారు. అయితే ఇచ్చిన గడువు లోగా డబ్బులు సర్పంచ్ చెల్లించలేదు. దీంతో ఆమెను పదవి నుంచి తొలగించడానికి నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో మళ్లీ సర్పంచ్ నిధుల వినియోగానికి సంబంధించి ఓచర్లు ఉన్నాయని, చేసిన ఖర్చుకు పంచాయతీ ఆమోదం ఉందని, చెక్కు డ్రాయింగ్ అధికారాలను తిరిగి పునరుద్ధరించాల్సిందిగా కలెక్టర్‌ను అభ్యర్థించారు. సర్పంచ్ అందజేసిన వివరాలు సమగ్రంగా లేకపోవడంతో నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు నిర్ధారించి ఆమె పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

అంతకుమించి..

(5వ పేజీ తరువాయి)

ఆ భూములను కొన్నామనే చెబుతున్నారు. ఈ భూములను కొంటే ఆస్తికి మించి డబ్బు ఎలా వచ్చింది? ఎక్కడి నుంచి వచ్చింది? కల్తీ మద్యం వ్యాపారం నుంచే వచ్చిందా? అనే విషయంపై చర్చ నడుస్తోంది.

అనుచరులకు అన్ని ఆస్తులా..?

జోగి రమేశ్ అనుచరులు కూడా భారీగా ఆస్తులు కొనడంపై అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. జోగి పీఏ ఆరేపల్లి రాము ఆయన బినామీ అని అందరూ అంటుంటారు. తన పీఏ భారీ జీతం కూడా తీసుకోలేదని చెబుతున్న రాము రూ.1.30 కోట్లతో ఇబ్రహీంపట్నంలో రెండంతస్థుల భవనాన్ని ఎలా కొన్నాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ భవనాన్ని జోగి రమేశ్ తన బినామీ పేరుతో కొన్నాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో మైలవరం నియోజకవర్గంలో దాదాపు 50 ఎకరాలు కొన్నట్టు సమాచారం. ఇవికాకుండా హైదరాబాద్‌లో మరో 10 ఎకరాలు కొన్నట్టు తెలుస్తోంది.

పెనమలూరు

● పెనమలూరు ● గన్నవరం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

గొల్లనపల్లిలో దుప్పట్ల పంపిణీ

గన్నవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లనపల్లికి చెందిన పద్మశాలి సేవా సంఘం సమన్వయకర్త దామర్ల నారద మునియ్య తన తల్లిదండ్రులు పరశురామయ్య, శేషమ్మల జ్ఞాపకార్థం 110 మందికి సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారదమునియ్య మాట్లాడుతూ, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తనవంతు సేవ చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వెంగల రంగారావు, శివయ్య, దార్న హనుమంతరావు, వెంగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.







ఉయ్యూరు మండలం కాటూరులో నేలవాలిన వరి.. ముస్తాబాదలో.. పాడైన మినుమును పరిశీలిస్తున్న సింగన్నగూడెం రైతులు

అన్నదాతకు అపార నష్టం

పెనమలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి మొంథా తుపాను కారణంగా పెనమలూరు మండలంలోని కంద, అరటి, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చోడవరం, పెనమలూరు, పెదపులిపాకలో వరి సాగు చేసిన రైతులు ఎకరాకు సరాసరి పాతికవేలు నష్ట పోయినట్లు వాపోయారు. కంకిగట్టే సమయంలో గాలికి వాన తోడవడంతో వరి నేలకొరిగింది.

పెనమలూరు నియోజకవర్గంలోని, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలతో పాటు గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో ఆంధ్రజ్యోతి బృందం పొలంబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించింది. ఆయా మండల గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మినుము, పెసర పంటలను పరిశీలించింది. అనేక మంది రైతులను పలకరించి మొంథా తుఫాన్ కారణంగా వారికి కలిగిన నష్టంపై ఆరా తీయగా వారి గోడు వెల్లబోసుకున్నారు. నేలవాలిన, నీట మునిగిన పంటను చూపిస్తూ కంటతడి పెట్టారు. ప్రతి సంవత్సరం ఎంతో కష్టపడి వ్యవసాయం చేస్తుంటే తుఫాన్ దెబ్బకు కుదేలు అవ్వాల్సి వస్తుందని ఆంధ్రజ్యోతి బృందం వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

4వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం

ఉయ్యూరు: మొంథా తుపానుకు మండల పరిధిలో చేతికందివచ్చే తరుణంలో వరి పంట నేలవాలి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో గింజలు గట్టిబడే స్థితిలో ఉండగా ఆలస్యంగా వేసిన లేత పంట పొట్టదశ దాటి గింజలు పాలుపోసు కునే తరుణంలో తుపాను గాలులకు నేలవాలింది. మండల పరిధిలో 13,500 ఎకరాల్లో వరిసాగు చేయగా షుమారు 4వేలకు పైగా ఎకరాల్లో పంటన ష్టం జరిగిందని మండల వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు నష్టం

కంకిపాడు : మొంథా తుపాను రైతాంగాన్ని నట్టేట ముంచింది. కూటమి ప్రభుత్వం పుణ్యమా అంటూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకపోయినప్పటికీ రైతు పూర్తి స్థాయిలో నష్టపోయారు. చేతికి వచ్చే దశలో పంట దెబ్బ దినడంతో రైతుకు సుమారు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు నష్ట పోయారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 17 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు.

2వేల ఎకరాల్లో నేలవాలిన వరి

గన్నవరం : మండలంలోని 21 గ్రామాల్లో 16700 ఎకరాల వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. మొంథా తుఫాన్‌తో సుమారు 2వేల ఎకరాల్లో వరి పంట నేలవాలింది. కొన్ని చోట్ల పూర్తిగా నీటిలో మునిగి పోయింది. ముస్తాబాద, సావరగూడెం, కేసరపల్లి, జక్కులనెక్కలం, బుద్ధవరం, అజ్జంపూడి, సూరంపల్లి గ్రామాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లింది. పంట చేతికి వచ్చి నేలవాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మినుముకు అపారనష్టం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మొంథా తుఫాన్ దెబ్బకు చేతికి వచ్చిన మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన మినుముపంట, కాలువ కింద సాగుచేసిన వరి పంట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. బాపులపాడు మండల వ్యాప్తంగా కానుమోలు, ఆరుగొలను, తిప్పనగుంట, సిరివాడ, ఓగిరాల, దంటగుంట్ల, రంగయ్యప్పారావుపేట, కాకులపాడు, వైకుంఠలక్ష్మీపురం తదితర గ్రామాల్లోని 16వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే అందులో 5వేల ఎకరాల్లోని వరిపంట నేలవాలిపోయి పూర్తిగా దెబ్బతింది.

3,600 ఎకరాల్లో నేలవాలిన వరి

ఉంగుటూరు: మండలంలో మొంథా తుపాను ప్రభావం పాక్షికంగా ఉంది. మొత్తం 26వేల ఎకరాల ఆయకట్టుకుగాను సుమారు 3,600 ఎకరాల్లో వరిపంట నేలవాలినట్లు వ్యవసాయశాఖాధికారుల అంచనా వేశారు. అత్యధికంగా మానికొండ (796ఎకరాలు)లో, అత్యల్పంగా పెదఅవుటపల్లి(58ఎకరాలు)లో పంటనష్టం జరిగింది. ఎకరాకు 25నుంచి 30వేల వరకు సాగు వ్యయం అయ్యిందని రైతులు తెలిపారు. ఎకరాకు 10నుంచి 15బస్తాల వరకు పంట దిగుబడులు తగ్గుతాయని రైతుల ఆందోళన చెందుతున్నారు.

రూ.10 లక్షలకుపైగా నష్టం

తాడిగడప గ్రామాన్ని ఆనుకొని ఉన్న తన పొలంలో ఐదెకరాల్లో అరటి, మరో ఐదెకరాల్లో కంద సాగు చేశాను. అరటి చెట్లు గెలలతో నేలకొరిగి పూర్తిగా ధ్వంసమయ్యాయి. కంద దుంప పూర్తిగా రాకుండానే కొంతమేర నష్టం వాటిల్లింది. దీంతో పది లక్షలకు పైగా నష్టపోయాను. అధికారులు నష్టం అంచనా వేయాలి. రైతులను అన్ని విధాల ఆదుకోకవాలి.

- మన్నె రాజబాబు, తాడిగడప

ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి

పంట నష్టం నమోదు చేసిన పొలం సర్వే నంబరు బ్లాక్ చేయడబడుతుందని, ఆ పొలంలో పంట నష్టం లెక్కలో ఉన్న ధాన్యం కొనుగోలు చేయడం సాధ్యపడదని అధికారులు చెప్పడం సబబు కాదని, ఆ ధాన్యం ఎవరికి అమ్ముకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు సడిలించి ధాన్యమంతా కొనుగోలు చేయాలి.

- కుక్కల రాంబాబు, కడవకొల్లు

మినుము మొత్తం నీటిపాలు

కౌలుకు తీసుకుని ఎకరానికి రూ.50వేల పెట్టుబడితో మినుము పంట సాగు చేశానని, తుఫాన్ దెబ్బకు మొత్తం నీటిపాలయిందని కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వం కనీసం రూ.30వేలు నష్టపరిహారం ఇస్తే మళ్లీ సాగు చేసేందుకు తయారవుతామని లేకపోతే పస్తులే దిక్కని వాపోయారు.

- సాంబశివరావు, సింగన్నగూడెం



శ్రీశైలంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రత్యేక పూజలు

పెనమలూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): భారత మహిళ క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలుచుకొన్న సందర్భంగా శ్రీశైలం శ్రీ భ్రమరాంబ అమ్మవారి శక్తి పీఠంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్, హేమ చౌదరి దంపతులు, కుమారుడు బోడె వెంకట్రాం, రీతిక దంపతులు, కుమార్తె వైష్ణవి, అల్లుడు పవన్‌కుమార్ తన పిల్లలతో కలసి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



స్కూల్ బస్ డ్రైవర్లు, సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్టీవో సుబ్బారావు

బస్సులు కండిషన్‌లో ఉంచుకోవాలి

ఉయ్యూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులు కండిషన్‌లో ఉంచుకుని, రోడ్డు నియమ, నిబంధనలు పాటిస్తూ ఏవిధమైన ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని ఉయ్యూరు ఆర్టీవో సుబ్బారావు అన్నారు. ఉయ్యూరు ఆర్టీవో కార్యాలయ పరిధిలో ప్రైవేట్ స్కూల్‌బస్సుల డ్రైవర్లు, సిబ్బందికి సోమవారం బస్సుల కండిషన్, సీబుక్‌లపై సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.



వైభవంగా శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆరుగొలను లోని వెమలపేటలో రూ.కోటి నిధులతో నిర్మించిన నూతన రామాలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తుల శ్రీరామ నామస్మరణల మధ్య మంగళవాయిద్యాలతో ఏకశిలా ధ్వజస్థంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యుడు బేతా శేషకుమార్ విజ్ఞప్తి మేరకు ఎస్సై సురేష్, మూర్తి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఆలయ నిర్వహణ నిమిత్తం బేతా సింహాచలం, రంగమ్మ దంపతులు అర ఎకరం భూమిని స్వామివారికి విరాళం గా ఇచ్చారు. పూర్వపుదాత నల్ల సూర్యనారాయణ జ్ఞాపకార్థం 60 సెంట్ల భూమిని వారి కుటుంబ సభ్యులు స్వామివారికి విరాళంగా ఇచ్చారు.

పోరంకిలో గంజాయి స్వాధీనం

పెనమలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలో గంజాయి కలిగి యున్న నలుగురు యువకులను పెనమలూరు పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. పోరంకిలోని బీజేఆర్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఒక భవనం వద్ద పోలీసులు ఏడుగురు యువకులను చూసి వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా వారిలో నలుగురు దొరకగా మిగిలిన ముగ్గురు పారిపోయారు. దొరికిన యువకుల వద్ద సోదా చేయగా వారి వద్ద ఏడువేల విలువైన 1.5కిలోల గంజాయి లభ్యమయింది. కేసు నమోదుచేసిన పోలీసులు మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. పట్టుకున్న నలుగురు యువకులను రిమాండుకు తరలించారు.

యాగశాల నిర్మాణానికి ముహూర్తం రాట



హనుమాన్‌జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైలమల్లికార్జునస్వామి దేవాలయంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి యాగశాల నిర్మాణానికి సోమవారం ముహూర్తం రాట వేశారు. ఆలయ అర్చకులు సామవేదం మారుతిశర్మ పర్యవేక్షణలో కమిటీ ఛైర్మన్ గూడవల్లి చిన్నా పూజలు నిర్వహించి రాటను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయానికి స్థానిక భక్తుడు కనుమూరి రామకృష్ణారెడ్డి నాగహారతి, నంది హారతి, బిల్వహారతి, త్రిశూల హారతి, సప్తహారతి, కాగడ హారతి, కమండలం తదితర సామాగ్రిని బహూకరిం చారు. కమిటీ సభ్యులు వీరమాచనేని నాగయ్య, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, రాంబాబు తదితరులు దాతను అభినందించి స్వామి వారి ఆశీస్సులతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జూనోటిక్ వ్యాధులపై అవగాహన

ఉంగుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జంతువుల నుంచి మానవులకు సంక్రమించే అంటు వ్యాధులపట్ల అవగాహనతో కూడిన అప్రమత్తత అవసరమని ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి.ఆనందకుమార్ అన్నారు. ప్రపంచ ఏక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని ఆత్కూరులో జూనోటిక్ వ్యాధులపై సమాజ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాడిరైతులు, ఆషావర్కర్లకు జూనోటిక్ వ్యాధులకు సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల పశువైద్యాధికారి డాక్టర్ యస్.నాగార్జున, డాక్టర్ జితేంద్రకుమార్, డాక్టర్ పి.శిరీష, డాక్టర్ మస్తాన్‌బీ, అఖిల పాల్గొన్నారు.

సమాజసేవ ద్వారా గ్రామీణాభివృద్ధి



కానూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమాజ సేవా కార్యక్ర మాల ద్వారా గ్రామీణాభివృద్ధి జరుగుతుందని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి. వెంకటేశ్వ రరావు అన్నారు. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ వరకు జరిగే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారం తాడిగడపలో ప్రారంభమయింది. ఈ శిబిరాన్ని వీసీ వెంకటేశ్వర రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ఎన్ఎస్ఎస్ సమన్వకర్త డాక్టర్ శివరాంప్రసాద్, అధికారు లు డాక్టర్ పి. సుష్మాచౌదరి, కె. మాధవి, నరేంద్రతోపాటు వాలంటీర్లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఆకునూరు విద్యార్థుల ప్రతిభ



ఉయ్యూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా పెదవేగిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యా ర్థులు ఈ నెల 26 నుంచి 30 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే ఎస్ జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్టు కళాశాల పీడీ నారాయణరావు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎస్.సరళకుమారి, ప్రిన్సిపాల్ రామలక్ష్మి పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం లోని రెండవ సోమవారం సందర్భంగా శివాలయాల్లో భక్తులు దీపారాధన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడిచర్ల మల్లికార్జునస్వామికి లక్షబిల్వార్చన నిర్వహించారు. వీరవల్లి కొండేశ్వరస్వామి దేవస్థానంలో కుటుంబ సభ్యులతో కలిసి మహిళలు దీపారాధన పూజలు నిర్వహించారు. అర్చకుడు కుం దుర్తి మురళీశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహిం చారు. పెరికీడులోని ముక్తేశ్వరాలయంలో అర్చకులు కుందుర్తి సీతారామయ్య, శ్యామ్, మహేష్‌ల ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.



వీరవల్లి కొండేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీపారాధన

గన్నవరంలో వైభవంగా కోటి దీపోత్సవం

గన్నవరం : స్థానిక పాత గన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. తొలుత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులచే కార్తీక పురాణం, శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అశేష భక్తజనంచే కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ పాల్గొన్నారు.



పాత గన్నవరం లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో కోటి దీపోత్సవం

కానూరు : కానూరులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీకమాస సందడి నెల కొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి శివుడిని, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయం పూజారులు ఫణి, కృష్ణఫణిలు పూజాక్రతువులు నిర్వహించారు.

సిద్ధార్థలో విజయవంతంగా సింపోజియం

కానూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం జనరేటివ్ ఏఐ అండ్ రెస్పాన్సిబుల్ ఇన్నోవేషన్... బ్రిడ్జింగ్ టెక్నాలజీస్ అండ్ ఎథిక్స్ అనే అంశంపై సింపోజియం జరిగింది. ఈకార్యక్రమాన్ని వర్సిటీ వైస్‌చాన్సలర్ పి. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌డీసీ) విశాఖపట్నం సైంటిఫిక్ ఆఫీసర్ ఎస్. సుధ పాల్గొని కీలక ఉపన్యాసం చేస్తూ విద్యా రంగంలో ఏఐ బాధ్యతాయత వినియోగం, నైతిక అవగాహన, బోధన- అభ్యాస పద్ధతులపై దాని ప్రభావం గురించి వివరించారు. అకడమిక్ పరిశోధనలను ఆచరణాత్మక ఆవిష్కరణలుగా మలచడంలో ఎన్ఆర్‌డీసీ పాత్ర, మేధో సంపత్తి హక్కుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమానికి డాక్టర్ కె. కీర్తి సమన్వయకర్తగా వి. లావణ్య, ముఖేష్ సహ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. సింపోజియంలో వంద మంది అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



తాడిగడప బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్, డైరెక్టర్లతో బీసీ నేతలు

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రంగనాథ్ ప్రమాణ స్వీకారం

పెనమలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ కార్యాలయం చైర్మన్ అనంతకుమారి అధ్యక్షతన తాడిగడపలోని కార్యాలయంలో డైరెక్టర్‌గా అంగర రంగనాథ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర, మురారి నాగలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తైక్వాండో చాంపియన్‌షిప్‌లో శ్రీశ్రీనివాస విద్యార్థులు



ఉయ్యూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఒంగోలులో జరిగిన 23వ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీశ్రీనివాస అక్షరాలయ విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్ శ్రీనివాస్‌ను పాఠశాల అధినేతలు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్యాడ్ బాయ్స్ క్రష్‌పై అవగాహన



ఉయ్యూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఆడపిల్లలు తీసు కోవలసిన జాగ్రత్తలు, ప్రవర్తన, బ్యాడ్ బాయ్స్ క్రష్ అనే అంశాలపై ఎంకె ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థిను లకు సోమవారం ఉయ్యూరు సీఐ టీ వీవీ రామారావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు పాల్గొన్నారు.

అక్రమంగా ఉమ్మడి స్థలాల విక్రయాలు


గండిగుంటలో సర్వేనంబరు 228/1, 226/3 అనధికార లేఅవుట్‌లో ఉమ్మడి స్థలం

ఉయ్యూరు, ఆంధ్రజ్యోతి: మండలంలోని గండిగుంట గ్రామపంచాయతీ ఉమ్మడిస్థలాల్లో అనధికార లే అవుట్లు వేసి యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. పంచాయతీ పరిధిలో గతంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు అనుమతులు పొంది అందులో ఇళ్లస్థలాల ప్లాట్లువేసి కొంతమేర ఉమ్మడి స్థలంగా చూపించి సీఆర్డీఏ నుంచి లే అవుట్‌కు అనుమతి పొందకుండా అమ్మేశారు. అందులో పంచాయతీకి చెందాల్సిన రూ.కోట్లు విలువైన ఉమ్మడిస్థలం రిజిస్టర్ చేసి ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాంకుడా వేరేవారికి విక్రయించి రిజిస్ట్రేషన్‌చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో 219, 218, 228/1ఏ, 228/2ఏ, 228/2బీ, 228/2సీ, 226/3, 229/2 సర్వే నంబర్లలో 18.02 ఎకరాల వ్యవసాయభూమి వ్యవసాయేతర భూమిగా మార్చి నివాస ప్రాంతాలుగా ప్లాట్లు వేసి విక్రయించేందుకు అనుమతి కోరుతూ నిర్వాహకుడు 2005లో దరఖాస్తు చేయగా పంచాయతీ పాలకవర్గం ఆమోదముద్రవేసింది. ఈ లేవుట్‌లో 226/3లో 72 సెంట్లు, 228/1ఏలో 75 సెంట్లు ఉమ్మడిస్థలంగా చూపించిన స్థలాన్ని గండిగుంటకు చెందిన ఓ నేత కొంతకాలం క్రితం అధికార పార్టీలోకి మారిన ప్రజాప్రతినిధికి 2014లో లే అవుట్ నిర్వాహకుడు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ ప్రజాప్రతినిధి స్థలాన్ని వ్యవసాయ భూమిగా వినియోగిస్తూ వరిసాగుచేస్తూ ఫలసాయం అనుభవిస్తూ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా తీసుకున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. కాటూరు రోడ్డులో ఓ వెంచర్‌లోని రూ.కోట్ల విలువైన 33సెంట్ల కామన్ సైట్‌ను ఆ వెంచర్ యజమాని ఇటీవల అమ్మి రిజిస్ట్రేషన్ చేసిన విషయమై అధికారుల విచారణలో ఉండటం పాఠకులకు విదితమే.

గండిగుంటలో కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం

కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం
కుమార్, గండిగుంట గ్రామపంచాయతీ కార్యదర్శి

రాష్ట్ర గ్రామపంచాయతీ ల్యాండ్ డెవలప్‌మెంట్, లే అవుట్, బిల్డింగ్ రూల్స్ 26-2-2002, జీవో 67 ప్రకారం వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మార్చి లే అవుట్ వేసేందుకు పంచాయతీ తీర్మానం తరువాత 90 రోజులు దాటితే ఉమ్మడిస్థలంగా చూపించిన స్థలం పంచాయతీ రిజిస్ట్రేషన్ చేయించుకోనప్పటికి పంచాయతీకే చెందుతుంది. రూల్ 11 (7) ప్రకారం పంచాయతీ ఆమోదించిన లే అవుట్‌లో రోడ్లు, పార్కులు, ఆటస్థలాలన్నీ పంచాయతీకి బదలాయించబడతాయి. రూల్ 13 (1) ప్రకారం అమలులో ఉన్న అన్ని లే అవుట్లు నిబంధనల మేర లేకపోయినా, లోటుపాట్లున్నా 2002 జీవో ప్రకారం కలెక్టర్ ఆదేశాలకు లోబడి ఉంటాయని, కామన్ సైట్ అన్యాక్రాంతంపై కలెక్టర్‌కు నివేదిక పంపుతాం.

జిల్లాస్థాయి అధికారుల పరిశీలన నేడు

గండిగుంట లే అవుట్లలో ఉమ్మడి స్థలాల అమ్మకాలు, అన్యాక్రాంతంపై కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు మంగళవారం పరిశీలించేందుకు వస్తున్నట్టు సమాచారం. గ్రామంలో పంచాయతీకి చెందిన ఉమ్మడి స్థలాలు అమ్మకాలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు వస్తున్నట్టు తెలిసింది.

ప్రముఖ వైద్యుడు మాధవ సాయి మృతి



చల్లపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాగోలు గ్రామానికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ చిరుమామిళ్ల మాధవ సాయి (84) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన విజయవాడలో కుమారుడి నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో హెచ్‌వోడీగా సేవలందించిన ఆయన ఉద్యోగ విరమణ అనంతరం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా సేవలందించారు. పుట్టిన ఊరిపై మమకారంతో ప్రతీ నెల గ్రామంలో ఉచిత వైద్యసేవలు అందించేవారు. ఆయన భౌతికకాయాన్ని పాగోలు గ్రామానికి తీసుకుని రాగా, స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారధి డాక్టర్ డీఆర్కే ప్రసాద్, వివేకానంద డిగ్రీ కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్, మేకా కమలాకరరావు (పెద్దబ్బాయి), ఎంపీటీసీ సభ్యుడు మేకా బంగారుబాబు, రిటైర్డ్ వీఆర్వో కంఠమనేని వెంకటేశ్వరరావు, కంఠమనేని రంగారావు, మేకా శ్రీనివాసరావు, నాదెళ్ల యోగ వెంకటేశ్వరరావు, కంఠమనేని కృష్ణ సందర్శించి నివాళులర్పించారు. డాక్టర్ డీఆర్కే ప్రసాద్ మహాప్రస్థానం వాహనాన్ని నడిపి అంతిమ వీడ్కోలు పలికారు. వ్యవసాయ క్షేత్రంలో దహన సంస్కారాలు జరిగాయి.


మాట్లాడుతున్న కేసీపీ యూనిట్ హెడ్ సీతారామ దాస్

రైతుకు లాభదాయకమైన పంట చెరకు

- ఉయ్యూరు కేసీపీ యూనిట్ హెడ్ సీతారామ దాస్

ఘంటసాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుకు లాభదాయకమైన పంట చెరకు మాత్రమేనని, చెరకు సాగుపై రైతులు ఆసక్తిని కనబర్చాలని ఉయ్యూరు కేసీపీ యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామ దాస్ పేర్కొన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, ఉయ్యూరు కేసీపీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చెరకు సాగు - తెగుళ్లపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే నిలబడే పంట ఒక్క చెరకు మాత్రమేనన్నారు. గతంలో ఈ ప్రాంతమంతా చెరకు సాగు చేపట్టిన ప్రాంతమేనన్నారు. కేసీపీ యాజమాన్యం రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. చెరకు సాగు చేపడితే పంటను తామే ఫ్యాక్టరీకి తీసుకెళ్తామన్నారు. కేవీకే సమన్వయకర్త సుధారాణి మాట్లాడుతూ చెరకులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిపంట పండించవచ్చన్నారు. ప్రస్తుతం చెరకు సాగు విస్తీర్ణం తగ్గిందని, సాగును అభివృద్ధిపై రైతులు ఆలోచించాలన్నారు. కేసీపీ జనరల్ మేనేజర్ వీవీ పున్నారావు, డీజీఎం వెంకటేశ్వర్లు, జోనల్ మేనేజర్ శ్రీరామచంద్రరావు, శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మీ, నవీన్, యశ్వంత్ కుమార్, ఆదర్శ రైతు వేమూరి రత్నగిరిరావు, రైతులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సునీల్ సస్పెన్షన్

తోట్లవల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగం అభియోగాలపై తోట్లవల్లూరు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సునీల్‌కుమార్ సోమవారం సస్పెండ్‌కు గురయ్యారు. పంచాయతీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ అద్దె సొమ్ములను జమచేయకుండా వాడుకున్నట్టు సునీల్‌కుమార్‌పై ఆరోపణలు వచ్చాయి. దీంతో అక్టోబర్ 16న గుడివాడ డీఎల్‌పీవో సంపత్‌కుమారి విచారణకు వచ్చారు. ఈ విచారణలో రూ 1,49,600 సునీల్ దుర్వినియోగం చేసినట్టు తేలింది. డీఎల్‌పీవో నివేదిక ఆధారంగా డీపీవో జే అరుణ సోమవారం సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టర్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

- కుటుంబ కలహాలే కారణం ● ప్రభుత్వ తప్పిదం లేదన్న కలెక్టర్ బాలాజీ


కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కృష్ణవేణిని తీసుకెళుతున్న పోలీసులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ బాలాజీ సాక్షిగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక వద్ద సోమవారం పెట్రోల్ పోసుకుని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సంచలనం రేకెత్తించింది. ప్రతి సోమవవారం నిర్వహించే మీ కోసంలో భాగంగా జిల్లా అధికారులంతా అర్జీలు తీసుకుంటూ బిజీగా ఉన్నారు. ఆ సమయంలో ఓ మహిళ పెద్దగా కేకలు వేస్తూ పెట్రోల్ బాటిల్ మూతతీసి ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో అక్కడున్న పోలీసులు పెట్రోల్ బాటిల్ లాక్కొని ప్రమాదాన్ని ఆపారు. దీంతో అధికారులందరూ ఊపిరిపీల్చుకున్నారు. బాధితురాలు కృష్ణవేణి యనమలకుదురు డొంకరోడ్డులో నివాసం ఉంటోంది. కుమారుడు, కుమార్తె. భర్త ప్రొక్లైనర్ డ్రైవర్‌గా విజయవాడలో పనిచేస్తూ కొంత డబ్బు సంపాదించాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్త మధ్య విభేదాలు తలెత్తి దూరమయ్యారు. ఇటీవల భర్త తోట శివకుమార్ హఠాత్తుగా మరణించాడు. ఆర్థిక పరిస్థితులు బాగోలేదు. భర్త కూడబెట్టిన డబ్బు, ఇన్సూరెన్సు, బాండ్లు, బ్యాంక్ బ్యాలెన్స్ అన్నీ భర్త కుటుంబ సభ్యుల మధ్యే ఉన్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇవేమీ ఆమెకు అందలేదు. పెద్ద మనషులు న్యాయం చేయలేదు. పైగా అక్కడి కాంట్రాక్టర్ భర్త కుటుంబ సభ్యులతో చేతులు కలిపి సహకరించడం లేదు. దీంతో దిక్కుతోచక కలెక్టర్ వద్దకు వచ్చింది. ఇది న్యాయపరమైన అంశమని, కోర్టును ఆశ్రయించాలని ఒక అధికారి చెప్పారు. దీంతో ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కృష్ణవేణికి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ గత్యంతరం లేని పరిస్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డానని, కలెక్టర్ న్యాయం చేస్తానంటున్నారని చెప్పారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ గేట్ వద్ద లోపలికి వచ్చే వారందరినీ చెక్ చేసి పంపుతారు. ఈ నేపథ్యంలో ఆమె సంచిలో ఉన్న పెట్రోల్ బాటిల్‌ను సిబ్బంది గమనించకపోవడం చర్చనీయాంశమైంది.

వైభవంగా తెప్పోత్సవం


తెప్పోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి 9 గంటలకు స్వామి వారి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని రుక్మిణి సహిత పాండురంగ స్వామికి హారతులిచ్చారు. రంగా రంగా పాండురంగా అంటూ భక్తులు భజనలు చేశారు. నాగులేటి ఒడ్డున రసలింగేశ్వర స్వామిని సందర్శించారు. మునుపెన్నడూ లేని విధంగా నిర్వహించిన ఈ తెప్పోత్సవంలో కూటమి నేతలు గొర్రెపాటి గోపీచంద్, పిప్పళ్ల కాంతారావు, సనకా నాగులు, మోటమర్రి బాబాప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథం, సోమశేఖర్ పాల్గొన్నారు.



చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న బుద్ధప్రసాద్ కుటుంబసభ్యులు, హంసలదీవి తీరంలో చాగంటి కోటేశ్వరరావు

దివిసీమ ఆధ్యాత్మిక పర్యటన సంతృప్తికరం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి

అవనిగడ్డ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివిసీమలో తాను జరిపిన ఆధ్యాత్మిక పర్యటన ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆహ్వానం మేరకు దివిసీమ పర్యటన అనంతరం ఆయన ఇంటికి చాగంటి కోటేశ్వరరావు విచ్చేశారు. దివిసీమలోని పురాతన క్షేత్రాలను సందర్శించటం ద్వారా ఆ క్షేత్రాల ప్రాశస్త్యాన్ని చాగంటి కోటేశ్వరరావు పెంచారని, దివిసీమవాసుల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చాగంటి మాట్లాడుతూ దివిసీమలోని చారిత్రక ఆలయాల సందర్శన తనకు మరుపురాని అనుభూతినిచ్చాయన్నారు. చాగంటి కోటేశ్వరరావును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆయన సతీమణి సతీమణి విజయలక్ష్మి, కుమారుడు మండలి వెంకట్రామ్ ఘనంగా సత్కరించారు.

హంసలదీవిలో పుణ్యస్నానం

కోడూరు: తొలుత చాగంటి హంసలదీవిలో పర్యటించారు. సోమవారం సంగమ ప్రదేశం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. దాదాపు 250 మందికి పైగా శిష్య బృందంతో హంసలదీవి క్షేత్రాన్ని దర్శించుకుని పూజలు చేశారు. యువనేత మండలి వెంకట్రామ్, కూటమి నేతలు స్వాగతం పలికారు. పోలీసు, మెరైన్, రెవెన్యూ, గ్రామపంచాయతీ శాఖల అధికారులు సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

కథే ఈ సినిమాకు హీరో


దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది


దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

ఘనంగా వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

గుడివాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : స్థానిక జగన్నాథపురంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీరంగం నుంచి వచ్చిన పవిత్రమాలలు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు లింగం చిట్టిబాబు, కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు, కమిటీ సభ్యుల చేతుల మీదుగా దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి సమర్పించారు. అనంతరం రక్షాబంధనం, మృత్యుం గ్రహణ హోమం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పవిత్ర మాలలను తీసుకువస్తున్న ఆలయ ఈవో గోపాలరావు

నేత్ర దానం



గుడ్లవల్లేరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు సూరపనేని పరందామయ్య సతీమణి నిర్మల (84) సోమవారం వయోభారంతో మృతి చెందారు. పరందామయ్య వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ద్వారా దానం చేశారు. పోరంకి ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యులు ఆమె నేత్రాలను సేకరించారు. ఆమె మృతి పట్ల లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారు సంతాపం తెలిపి నివాళులర్పించారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

పెదపారుపూడి : మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని దోసపాడుకు చెందిన మన్యం కిషోర్ 37,500లు, అప్పికట్ల గ్రామంలో సాయల శేషమ్మకు రూ.30,028లు వంతున సహాయనిధి చెక్కులు అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

కళావేదిక పైకప్పు ఏర్పాటు

నందివాడ: పూర్వ విద్యార్థులు 2000-2001 బ్యాచ్ సౌజన్యంతో సుమారు 40 వేలతో వెన్ననపూడి జడ్పీ హైస్కూల్‌లో వేదికకు రూఫ్ టాప్ ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఈ కళావేదిక ఎంఈవో-2 డేవిడ్ రత్నరాజు, వెంకట రామాపురం సర్పంచ్ కాకరాల సురేష్ ప్రారంభించినట్లు మాధవ్ కుమార్ తెలిపారు.

యువకుడు కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ : స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజులపాటి వెంకటేశ్వరరావు స్థానిక చేపల మార్కెట్ వద్ద గల మెకానిక్ షెడ్డులో గత నెల రోజులుగా పనిచేస్తున్నాడు. అక్టోబరు 31వ తేదీన పనికి వెళ్లిన వెంకటేశ్వరరావు ఇంటికి చేరకపోవడంతో అతని కుటుంబసభ్యులు వెతుకులాడారు. దీంతో వెంకటేశ్వరరావు తమ్ముడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ గణేష్‌కుమార్ తెలిపారు.

కోట్లాటలో ఒకరికి గాయాలు

గుడివాడ : స్థానిక రైలుపేటకు చెందిన వేల్పుల ఏసుబాబు, పండులు ఆదివారం రాత్రి ఫుల్‌గా మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాట మాట పెరిగి కోట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో పండు, ఏసుబాబును కొట్టాడు. గాయపడిన ఏసుబాబును స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఏసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై పి.లోవరాజు తెలిపారు.


కౌతవరం రైల్వేస్టేషన్ వద్ద నేలకొరిగిన వరి చేలు


వరికంకులను బల్లపై చేతులతో కొడుతూ నూరుస్తున్న రైతులు


కొండిపర్రు శివారు భూమిలో దెబ్బతిన్న కందపంట


తోట్లవల్లూరులో తుపాను గాలులకు విరిగిన అరటితోట

'మొంథా'తో రైతులకు అపార నష్టం

మొంథా తుఫాను నిండా ముంచిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వివిధ దశల్లో ఉన్న వరిపైరు నేలవాలి రైతులకు తీవ్రనష్టం కలగజేసింది. చేతికొచ్చే దశలో ఉన్న వరి నేలవాలడంతో కిందున్న కంకులు నాని మొలక వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సాగుచేసిన రైతుల నుంచి ఆంధ్రజ్యోతి బృందం అభిప్రాయాలను సేకరించింది.

కూచిపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అనుకోని కష్టం వచ్చి మొంథా తుఫాన్ రూపంలో రైతులను నిండా ముంచి వేలాది రూపాయలు ఖర్చు చేసి చేతికంది వచ్చిన పంటను కోల్పోయినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మొవ్వ మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో 11250 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. మరో 15 రోజుల్లో వరి కోతలు కోయాల్సి ఉండగా, మొంథా ముంచెత్తింది. ఎకరాకు 30 వేలు వరకు రైతులు ఖర్చు చేశారు. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించి ఆదుకుంటే గానీ అప్పుల ఊబిలో నుంచి బయటకు వచ్చే పరిస్థితులు కనిపించటం లేదని రైతులు వాపోతున్నారు.

దిగుబడి తగ్గే అవకాశం ఉంది

-నాగబోయిన సునీల్, రైతు


సునీల్

20 ఎకరాలు వరి సాగు చేస్తున్నాను. ఎకరాకు 30 వేలు వరకు ఖర్చు అయింది. పాలు పోసుకునే దశలో ఉన్న పొలం మొంథా తుఫాను ప్రభావానికి పూర్తిగా నేలకొరింది. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుందనుకున్న తరుణంలో ప్రస్తుత పరిస్థితుల్లో 10 నుంచి 15 బస్తాలు దిగుబడి రావ టం కష్టంగా మారింది.

అప్పుల ఊబిలో కూరుకుపోయాం

- పరమేశ్వరరావు , రైతు


పరమేశ్వరరావు

చేతికందిన కాడికి అప్పులు తెచ్చి వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టాము. 1318 రకానికి చెందిన వరి వంగడాన్ని పది ఎకరాల్లో సాగు చేశాము. మరో 15 రోజుల్లో కోతకు వచ్చే తరుణంలో తుఫాన్ ముంచెత్తింది. రైతులకు రుణమాఫీ చేయటంతోపాటు పూర్తి సబ్సిడీతో మినుము విత్తనాలు అందించాలి.

గుడివాడ : అంగలూరు, చంద్రాల, విన్నకోట, జేమ్సుపేట, కట్టావాని చెరువు, కౌతవరం, వడ్లమన్నాడు, ఉలవలపూడి, పెసరమిల్లి, డోకిపర్రు గ్రామాల పరిధిలో 20 నుంచి 50 ఎకరాల వరకు చేతికి వచ్చిన వరి పంట మొంథా తుఫాను దెబ్బకు నేలకొరిగింది.

తీవ్రంగా నష్టపోయా

- వేములపల్లి రాజేంద్రప్రసాద్, రైతు


రాజేంద్రప్రసాద్

మొంథా తుఫాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయాయి. దాదాపుగా 70శాతం వరి పొలం నేలకొరిగిందని వాపోయారు. పంటపొలాల్లో నిలిచిన ఉన్ననీటిని తోడేందుకు ఇంజన్‌లతో నీటిని బయటకు పంపేందుకు 7ఎకరాల్లో దారులు చేయిస్తున్నాం.

పమిడిముక్కల : స్థానిక కృష్ణాపురం, ముసలనాయకపాలెం, చోరగుడి, లంకపల్లి పరిసర గ్రామాల్లో వరిపంటకు ఎక్కువగా నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచన. మర్రివాడ, హనుమంత పురం, కపిలేశ్వరపురం, మంటాడ, గోపువానిపాలెం పరిసర గ్రామాల్లో కొంతమేర వరి నేల వాలి పంట నష్టం వాటిల్లింది. పండిన ధాన్యమంతా కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గుడివాడ రూరల్ : మండలంలో 21 గ్రామాల్లో సుమారు 18వేల ఎకరాల్లో వరి పంట నష్టం తీవ్రత పెద్దగా లేదు. మండలంలోని శేరిదింటకుర్రు, చౌటపల్లి, సిద్దాంతం, తట్టివర్రు తదితర గ్రామాల్లోని పల్లపు వరి చేలు తుఫాను దాటికి నెలకొరిగాయి. ఎకరాకు 5బస్తాల మేర ధాన్యం తక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంది. తుఫాను సందర్భంగా వీచిన ఈదురుగా గాలులకు వరికంకుల పొట్టలు బద్దలయ్యాయి. దీంతో ధాన్యం నాణ్యత తగ్గుతుంది. గుడివాడలో 2వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిన్నట్లు అధికారులు తెలిపారు.

పామర్రు : మొంథా తుఫాను తాకిడికి పామర్రు మండలంలోని పలుగ్రామాల్లో రైతులు, కౌలుదారులు సాగు చేసిన వరి, కంది, అరటి, బొప్పాయి పంటలను ఏబీఎన్ ఆంధ్రజ్యోతి బృందం సోమవారం వారి కష్టాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యాటనలో భాగంగా పోలంబాట పట్టింది. కురుమద్దాలి, బల్లిపర్రు, పెదమద్దాలి, పామర్రు, కొండిపర్రు, జుజ్జువరం, గ్రామాల్లో పర్యటన సాగింది.

అధికారుల అంచన ప్రకారం మండల వ్యాప్తంగా ఈక్రాప్ బుకింగ్ ద్వారా 22400 ఏకరాల్లో వరిసాగుకాగా, ప్రస్తుతం గ్రామాల్లో సర్వేనిర్వహించి పంటనష్టం వివరాలను 1525 ఏకరాలగా నమోదు చేయడం జరిగిందని మండల వ్యవసాయాదికారి వి.శివనాగరాణి వివరించారు. అదేవిధంగా ఉద్యనవన పంటలైన అరటి,బొప్పాయి,కంద, నిమ్మ, ఇతర కూరగాయల పంటలు కలుపుకుని 135 ఎకరాలు ఈక్రాప్ నమోదుఅయిందని ఏవో కీర్తి వెల్లడించారు.

దెబ్బతిన్న పంటను ప్రభుత్వం కోనుగోలు చేయాలి

- చంటి కౌలురైతు


చంటి

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటను గత ప్రభుత్వం మాదిరిగానే ప్రభుత్వం కోనుగోలు చేసి పేద రైతు ను ఆదుకోవాలి. దెబ్బతిన్న దాన్యం ప్రభుత్వ కొనుగోలు చేయడంతోపాటు పంట నష్టపరిహారాన్ని అందించాలి.

రైతులకు ప్రభుత్వం అండగానిలవాలి

- మున్నంగి అంజిరెడ్డి ,కౌలురైతు


అంజిరెడ్డి

గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి సన్నచిన్నకారు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు విధంగా న్యాయం చేయాలి. అప్పులు చేసి ఇప్పటి వరకు పెట్టుబడి పెట్టిన పేద రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి.

పెదపారుపూడి : మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో ఆంధ్రజ్యోతి పొలం బాటలో భాగంగా గురువిందగుంట, మహేశ్వరపురం, దూలవానిగూడెం, పాములపాడు, దోసపాడు, మోపర్రు, విజయనంపాడు, సోమవారప్పాడు, వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురం, వెంట్రప్రగడ గ్రామాల్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి బృందం క్షేత స్థాయిలో పర్యటించి అక్కడి పరిస్థితులను రైతులను అడిగి తెలుసుకుంది.

నందివాడ: నందివాడ మండలంలోని పొలుకొండ , తమిరిశ , జనార్ధనపురం , పుట్టగుంట చినలింగాల, పెదలింగాల్లోని వరి పొలాలను సోమవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించింది. తమిరిశలో మద్దాల కరుణాకరరావు పొలాలు నేలకొరిగాయి.

ఎకరానికి 20 బస్తాలు అయ్యే పరిస్థితి లేదు

-మాయర నాగేశ్వరరావు , కౌలు రైతు


నాగేశ్వరరావు

మూడు ఎకరాలు కౌలు చేస్తున్నాను. ఎకరానికి 18 బస్తాలు కౌలు మొంథా తుపాను రాకపోతే ఎకరానికి 40 బస్తాలు అయ్యేది. ఇప్పుడు ఎకరానికి 20 బస్తాలు సైతం అవుతుందో లేదోనని అనమానం కలుగుతుంది.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలంలో సోమవారం ఆంధ్రజ్యోతి బృందం పొలంబాట కార్యక్రమం నిర్వహించింది. తోట్లవల్లూరు నుంచి పెనమకూరు వెళ్లే జడ్పీ రోడ్డు వెంట తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, పెనమకూరు వరకు, కంకిపాడు వైపు వల్లూరుపాలెం, చినపులిపాక గ్రామాల్లో 15 కిలోమీటర్లు పర్యటించగా మొంథా తుపానుకు కకావికలమైన వరిచేలు దర్శనమిచ్చాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అరటి తోటలు ధ్వంసమయ్యాయి.

రెండెకరాల వరిచేను దెబ్బతింది

- గొరిపర్తి రామకృష్ణ, కౌలురైతు


రామకృష్ణ

తోట్లవల్లూరు చిల్లడొంక ఏరియాల్లో రెండకరాల కౌలుపొలంలో వరిచేను తుఫానుకు పూర్తిగా పాడయింది. 1061 రకం వరిసాగు చేశాను. కంకులు వచ్చాయి. మట్టిలో ఉన్న కంకులన్నీ కుళ్ళిపోతున్నాయి. సాగుఖర్చులు ఎకరాకు రూ 25 వేల వరకు పెట్టాము. ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తే నష్టాల నుంచి బయట పడతాం.

బాలాత్రిపుర సుందరీదేవి ఆలయాన్ని సందర్శించిన చాగంటి

కూచిపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచన కర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు కూచిపూడిలోని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో చాగంటి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, గ్రామసర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, ఎంపీడీవో సుహాసిని, దేవాలయ పాలకమండలి సభ్యులు పలువురు గ్రామస్థులు చాగంటిను సత్కరించారు.


చాగంటికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న పండితులు

శ్రీ సిద్ధేంద్ర కళావేదికపై ప్రదర్శించిన పలు నాట్యాంశాలు ఆకట్టుకున్నాయి. కాకినాడకు చెందిన శ్రీకరి ప్రదర్శించిన రామాయణ శబ్దం అబ్బురపరిచింది. అనంతరం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం వైస్ ప్రిన్సిపల్ చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో సాగిన మోహిని బస్మాశుర నృత్య రూపకం ఆనంద డోలికల్లో ముంచెత్తింది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన లలిత తక్కువేమి మనకు, మండుక శబ్దం, జయజయ దుర్గే తదితర అంశాల్లో చూపిన హావభావాలు ఆకట్టుకున్నాయి. కళాకారులను చాగంటి కోటేశ్వరరావు అభినందించి మెమెంటోలు అందించి సత్కరించారు.


నృత్య రూపకంలో కళాకారుల అభినయం

వైభవంగా గంగానమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ

గుడ్లవల్లేరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో గంగానమ్మ , పోతురాజుస్వామిల నూతన విగ్రహాలు, నూతన ఆలయ గోపుర శిఖరాల ప్రతిష్ఠా మహోత్సవం కన్నుల పండుగగా వేలాది మంది భక్తజన సందోహం నడుమ నిర్వహించారు. తొలుత శ్రీమత్ గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో దాదాపు 200 కు పైగా మహిళలు పాలపొంగళ్లు పొంగించారు. వల్లభనేని వెంకటరావు కుటుంబం నుంచి వల్లభనేని కృష్ణప్రసాద్ దంపతులచే అమ్మవారికి మహాసారెతో, 200 మందికి పైగా మహిళలు పాలపొంగళ్లతో, 18 ఘటములతో తాటికల్లు లతో మేళ తాళాలు, మంగళవాద్యాలు, తీన్మార్ డప్పులు, కనక డప్పుల నడుమ భారీ బాణాసంచా పేలుస్తూ భక్తి శ్రద్ధలతో గంగానమ్మ అమ్మవారికి సారె, పాల పొంగళ్లు సమర్పించారు. గ్రామోత్సవంగా తీసుకు వెళ్లి విగ్రహ, శిఖర ప్రతిష్ఠల అనంతరం అమ్మవారికి సమర్పించారు. అనంతరం దాదాపు పది వేల మందికి మహా అన్నసమారాధన నిర్వహించారు. గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు దంపతుల చేతులమీదుగా అమ్మవారి విగ్రహప్రతిష్ఠ, కొసరాజు బాపయ్యచౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, వల్లూరుపల్లి సత్యనారాయణరావు, వల్లూరుపల్లి రామకృష్ణ, యలమంచిలి రామకోటేశ్వరరావు చేతులమీదుగా శిఖర ప్రతిష్ఠలు నిర్వహించారు. గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు, గుడ్లవల్లేరు ఎస్సై ఎన్‌వీవీ సత్యనారాయణల పర్యవేక్షణలో ఇద్దరు ఎస్సైలు, 5గురు ఎఎస్సైలు, 25 మందికి పైగా పోలీసుల బందోబస్తు నిర్వహించారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, వల్లభనేని వెంకట్రామయ్య, కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ, వెనిగండ్ల రామకృష్ణ, జగన్మోహనరావు, వేణుగోపాల్, డీసీ చైర్మన్ ఆంజనేయులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారె, పొంగళ్లు సమర్పిస్తున్న భక్తులు

తెలుగు విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తా

● ఆచార్య మునిరత్నం నాయుడు

కూచిపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వవిద్యాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైస్ చాన్సలర్ ఆచార్య మునిరత్నం నాయుడు పేర్కొన్నారు. గత నెల 23వ తేదీన వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి విగ్రహానికి, సిద్ధేంద్ర యోగి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వళన చేశారు. అనంతరం కళాపీఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 -26 విద్యాసంవత్సరానికి కూచిపూడి నాట్య కళాపీఠంలో గతంలో మాదిరిగానే తరగతుల నిర్వహణకు ఇచ్చిన నోటిఫికేషన్‌కు స్పందన పెరిగి దరఖాస్తులు దాఖలు చేసుకున్నట్లు వివరించారు. ఓఎస్‌డీ ఆచార్య వి.నిరీక్షణ బాబు, కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ రవిబాలకృష్ణ, పాల్గొన్నారు.


జ్యోతిని వెలిగిస్తున్న మునిరత్నం నాయుడు

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ పతిష్ఠ

పెదపారుపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాములపాడులోని కార్యసిద్ధి అభయాంజనేయస్వా మి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ , కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల పరిధిలోని సోమవరప్పాడులో శ్రీరామమందిరం పునః నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థులు సమిష్టిగా శ్రీరామ మందిరం నిర్మాణానికి ముందు కు రావటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు మార్కెట్ యార్డు చైర్మన్ జన్ను శోభన్‌బాబు, సజ్జా శివకుమార్, దాసి రమేష్, దగాని లెనిన్, దూళ్ల జెమిబాబు, నాగదీప్, సునీత, వాసు, రాజుబోయిన నారాయణ, సుబ్రహ్మణ్యం, అశోక్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

తోట్లవల్లూరు విద్యార్థులకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం 26న

తోట్లవల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన పాముల హిమ బిందు, వీరంకి వెంకట బాలాజీ బాజీరావు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అసెంబ్లీలో మాట్లాడే అవకాశాన్ని దక్కించుకున్నారని ప్రధానోపాధ్యాయుడు ఫణి రాజమోహన్ సోమవారం తెలిపారు. పామర్రులో నియోజకవర్గస్థాయిలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ పోటీలలో హిమ బిందు ప్రథమ, వెంకట బాలాజీ బాజీరావు ద్వితీయ స్థానాల్లో నిలిచి అసెంబ్లీలో స్పీకర్‌తో అధ్యక్షా అని మాట్లాడేందుకు అర్హత సాధించారని, ఇది హైస్కూల్‌కి గర్వకారణమని పేర్కొన్నారు. గైడ్ టీచర్ పడవల రంగనాయకులుని, ఉపాధ్యాయులను ఫణి రాజమోహన్ అభినందించారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి సత్కారం

గుడివాడ : నూరు వసంతాలు పూర్తి చేసుకున్న తమకు విద్య నేర్పిన గురువు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పినిపాటి అనంతశాస్త్రిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక గౌరీశంకరపురంలోని ఆయన స్వగృహంలో ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పినిపాటి అనంతశాస్త్రి 100వ పుట్టినరోజు వేడుకలను ఏజీకే పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ పాఠశాల చైర్మన్ చోడవరపు విజయకుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ

గుడివాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానం, గౌరీశంకరస్వామి దేవస్థానాల్లో భక్తులు వేలాది మందిగా తరలివచ్చి తెల్లవారుజాము నుంచే స్వామిని దర్శించుకున్నారు. ఈవో కందుల వేణుగోపాలరావు, పాల్గొన్నారు.

పామర్రు:కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా ప్రసిద్ధిగాంచిన పామర్రు శివాలయంతోపాటు మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నందివాడ : కార్తీక మాస రెండవ సోమవారం సందర్భంగా పోలుకొండ, కుదరవల్లి, అనమనపూడి, పుట్టగుంట, తమిరిశ గ్రామాల్లో శివాలయాలలో భక్తులు తెల్లవారుజాము నుంచి స్వామివార్ల దర్శనానికి పోటెత్తారు

గుడ్లవల్లేరు : కార్తీకమాసం రెండో సోమవారం మండలంలో శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. పలువురు కేదారేశ్వర వ్రతాలు తమ తమ గృహాలలో పెద్దసంఖ్యలో నోచుకొని శివాలయాలకు శివయ్య దర్శనానికి విచ్చేశారు. గుడ్లవల్లేరు శ్రీమత్ గంగా పార్వతీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో లక్ష రుద్రాక్షల శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. కౌతవరం గౌతమేశ్వరాలయంలో, వడ్లమన్నాడు, విన్నకోట, డోకిపర్రు, అంగలూరు, చంద్రాల,పెసరమిల్లి గ్రామాల్లో శివాలయాలలో భక్తులు శివుని దర్శించుకుని దీపార్చనలు చేశారు.


కార్తీక దీపారాధనలో పాల్గొన్న మహిళలు, భక్తులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575



మోపిదేవి ఆలయానికి హుండీలు, అన్నదానం ట్రాలీల వితరణ



మోపిదేవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి తెనాలికి చెందిన తాడిపాక చిన్ని శేషసల్ప సాయి రమాదేవి కుటుంబసభ్యులు రెండు హుండీలను, కోడూరుకు చెందిన సిద్ధినేని వంశీ మణికంఠ సాయిలక్ష్మీ ప్రసన్న కుటుంబసభ్యులు అన్నదానం ట్రాలీలను వితరణగా అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావుకు వాటిని అందజేశారు.



కానూరులో పడిపోయిన వరిని చూపుతున్న రైతులు



దావోజీపాలెంలో వరిని నిలబెట్టి కడుతున్న రైతులు



కె.కొత్తపాలెం వద్ద దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతులు



పులిగడ్డ వద్ద గాలులకు పడిపోయిన అరటి తోటలు

నష్టం కొండంత - నమోదు గోరంత

●వరి నీళ్లలో ఉంటేనే పంట నష్టం నమోదు ● పడిపోయిన వరిని నమోదు చేయడం లేదంటూ రైతుల ఆవేదన

తూర్పు కృష్ణాలో మొంథా తుఫాను తీవ్రతకు పంట నష్టం ఎక్కువగానే జరిగిందని సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన పొలంబాటలో స్పష్టమైంది. ఈత దశలో, పాలుపోసుకునే దశలో గాలులు, వర్షం రావడంతో వరి పడిపోయి దిగుబడిని దెబ్బతీసిందని రైతులు తెలిపారు.

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావంతో బందరు మండలంలో తీవ్ర నష్టం జరిగింది. 34 గ్రామాల్లో 15,984 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగింది. 22 గ్రామాల్లో 9700 ఎకరాలు పంట దెబ్బతిన్నది. 712 ఎకరాల్లో 561 మంది రైతులు వేసిన వేరుశనగ పూర్తిగా దెబ్బతిన్నది. వరి కంకులు కొట్టుకుని తీవ్ర నష్టం వాటిల్లింది. చిట్టిపాలెం, సీతారామపురం, గుండుపాలెం, బివి తోట, కానూరు, కోన, పెదపట్నం, తాళ్ళపాలెం తదితర గ్రామాలలో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. మంగినపూడి, మేకావానిపాలెం, తాళ్ళపాలెం తదితర ప్రాంతాలలో వేరుశనగ పంట పూర్తిగా పాడైపోయింది. రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కౌలురైతుల పరిస్థితి దారుణంగా ఉంది. **గూడూరు** : మొంథా తుపాను రైతుల నడ్డి విరిచింది. గూడూరు, కోకనారాయణపాలెం, నారికేడలవారిపాలెం, కంకటావ, ముక్కొల్లు, తరకటూరు, చిట్టిగూడూరు, కంచాకోడూరు, రామరాజుపాలెం, ఆకుమర్రు, రాయవరం, మల్లవోలు తదితర గ్రామాల్లో సుమారు 35 కిలోమీటర్ల వరకు పొలంబాట నిర్వహించగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 20,500 ఎకరాలు రైతులు వరి సాగు చేయగా, ఆరు వేల ఎకరాలు పంట నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వరి ఈనే దశలో దిగుబడిని దెబ్బతీసిందని రైతులు తెలిపారు.

పంటనష్టం నమోదు చేయటం లేదు



15 ఎకరాల్లో బీపీటీ సాగుచేశాను. ఇప్పటి వరకు రూ.4 లక్షలు ఖర్చు చేశాను. 15 రోజుల్లో పంట కోతకు రానుండగా.. తుపాను దెబ్బకు మొత్తం వరి నేలకొరిగింది. పంట నష్టం నమోదుకు ఇప్పటి వరకు అధికారులు ఎవరూ రాలేదు. కోసిన తరువాత దిగుబడి ఎంత ఉంటుందనేది సందేహమే.

- ఊచా వెంకటేశ్వరరావు, సర్పంచి, నేలకొండపల్లి

పెడన మండలంలో..

పెడన రూరల్ : మొంథా తుపాను కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వరి దెబ్బతిందని రైతులు వాపోతున్నారు. కొంకేపూడి, నడుపూరు, నెరికేపాలెం, కూడూరు, కృష్ణాపురం, నందిగం, దావోజీపాలెం, శేరీవర్తర్లపల్లి, పెనుమల్లి, నేలకొండపల్లి, చోడవరం గ్రామాలలో తుపాను కారణంగా చేలు నేలకొరిగినప్పటికి అధికారులెవరూ కన్నెత్తి చూడడం లేదని రైతులు తెలిపారు. గింజ పాలు పోసుకునే దశలు తుపాను రావటం వలన తాలు, తప్ప కంకి వస్తాయన్నారు. ఈదురు గాలులకు సగానికిపైగా చేలు పడిపోయాయి. చేలు నీట మునిగితేనే పంట నష్టం కింద నమోదౌతుందని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చోడవరంలో 1236 ఎకరాల్లో వరి సాగు చేయగా, నిబంధనల ప్రకారం ఎకరం కూడా నమోదు కాలేదని వీఏవో యూసుఫ్ తెలిపారు. కమలాపురం, కొంగంచర్ల, గురివిందగుంట, ముచ్చర్ల, కొప్పల్లి, ఉరివి, లంకలకలవగుంటలో పంటనష్టం నమోదు ప్రక్రియ చేపట్టినప్పటికి ఎంత శాతం నష్టం అనేది రైతులకు తెలియటంలేదన్నారు. బల్లిపర్రు, మడక, శింగరాయపాలెం, కాకర్లమూడి, జింజేరు, గౌడపాలెం, అచ్చయ్యవారిపాలెం, నందమూరు గ్రామాలలో పంటనష్టం నమోదు మొదలు పెట్టారని రైతులు తెలిపారు. పంటనష్టం నమోదు కొనసాగుతోందని, అన్ని గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి జెస్సీ తెలిపారు.

రెండు వేల హెక్టార్లలో నష్టం

బంటుమిల్లి : మొంథా తుఫాను కారణంగా మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దాదాపు ఐదు వేల హెక్టార్లలో వరి సాగు చేయగా సుమారు రెండు వేల హెక్టార్లలో పంటకు నష్టం జరిగింది. నీట మునిగిన వరి రంగు మారుతోందని, కొన్ని చోట్ల గింజ పూర్తిగా తయారుకావడం లేదని రైతులు తెలిపారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి



కొర్లపాడు పంచాయతీ నారాయణపురంలో నాలుగు ఎకరాల పంట నేలకొరిగింది. కనీస ఖర్చులు కూడా రావు. పశుగ్రాసానికి కూడా ఉపయోగపడదు. నీరు ఇంకా బయటకి పోలేదు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాం.

- కాగిత గణపతి, నారాయణపురం



ఆవేదన వ్యక్తం చేస్తున్న కె.కొత్తపాలెం రైతులు

నష్టాన్ని అంచనా వేయాలి

అవనిగడ్డ మండలంలో 6500 ఎకరాల్లో వరిసాగు జరుగగా, ఎక్కడా పంట నష్టం జరగలేదని వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పాలు పోసుకునే దశలోనూ, వివిధ దశల్లో ఉన్న పొలాల విషయంలో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలి.

- వెంకట సుబ్బారావు, వేకనూరు

దివిసీమలో అపార నష్టం

చల్లపల్లి/మోపిదేవి/అవనిగడ్డరూరల్/నాగాయలంక/ కోడూరు, ఘంటసాల: మొంథా తుఫానుతో వరి రైతులు నిలువునా మునిగిపోయారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో లక్ష ఎకరాలకు పైగా వరి సాగు చేయగా, మొంథా తుఫాన్ ప్రభావంతో వీచిన భీకర గాలులు, కురిసిన భారీ వర్షాలకు ఈత ఈని పాలుపోసుకునే దశలో ఉన్న వందలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. ఆలస్యంగా నాట్లు వేసిన తీర మండలాలైన నాగాయలంక, అవనిగడ్డ, కోడూ రుల్లో బిగులు పొట్ట ఈనిక దశల్లో ఉన్న పంట పొలం గాలులకు పడిపోనప్పటికీ ఈదురుగాలుల ప్రభావంతో పొట్ట చిరిగి కంకి ఈనిక కష్టమై, మరో వారం రోజులపాటు ఈనే పరిస్థితి లేదని నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు మండలాల రైతులు వాపోతున్నారు. ముందుగా నాట్లు పూర్తి చేసుకున్న మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో వరిఅన్ని చోట్ల పాలు పోసుకునే దశ, గింజ గట్టిపడే దశల్లో ఉండగా, గింజ గట్టిపడే దశలోని పొలాల్లో అత్యధిక భాగం గాలులకు పడిపోయి నీటిలో నానుతోంది. దీని వల్ల గింజ రాలిపోవటం, నాణ్యత తగ్గిపోయి ధర తగ్గిపోవటం జరుగుతుం దని రైతులు ఆందోళన చెందుతున్నారు. గింజ పాలు పోసుకోకుండా తెల్లకంకులు వస్తుండటంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పంట నష్టం జరుగగా, నిబంధనల పేరుతో అధికారులు తమను పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. 33 శాతం కంటే ఎక్కువ పంట పడిపోతేనే నష్టం జరిగినట్లుగా అధికారులు నమోదు చేస్తున్నారని, నిలబడి ఉన్న పొలంలో సుంకు రాలిపోయినా, పొట్ట పగిలిపోయినా వాటిని నష్టం కింద నమోదు చేయటం లేదనిరైతులు తెలిపారు. ఘంటసాల మండలంలో మొత్తం 19,400 ఎకరాల్లో వరి సాగు చేయగా, తొమ్మిది వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి, నిబంధనల పేరుతో నష్టం అంచనాలను తగ్గించేందుకు చూస్తున్నారని ఘంటసాల మండల రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అంచనాకు రూపొందించిన నిబంధనలతో నేడు వెయ్యి హెక్టార్లు కూడా నష్టం అంచనాకు రావటం లేదని రైతులు తెలిపారు. చల్లపల్లి మండల పరిధిలోని వెలివోలు, యార్లగడ్డ, మేకావారిపాలెం, పాగోలు, మంగళాపురం, మాజేరు గ్రామాల్లో పంట నేలకొరగగా, మిగిలిన చోట్ల పంట నిలబడి ఉన్నప్పటికీ తెల్ల కంకులు కనిపించటంతో రైతన్న ఆందోళన చెందుతున్నాడు. నాగాయలంక మండలంలో 17 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా, తొలుత మూడు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేసిన అధికారులు అనంతరం వేసిన అంచనాల్లో 1000 ఎకరాల్లోపే నష్టం జరిగినట్లు చూపిస్తున్నారు. కోడూరు మండల పరిధిలోని నరసింహాపురం, ఉల్లిపాలెం, నక్కవానిదారి, లింగారెడ్డిపాలెం, జయపురం, వి.కొత్తపాలెం గ్రామాల్లో వరి పంట నేలకొరిగి పెద్ద ఎత్తున నష్టం జరిగిందని, అధికారులు మాత్రం కేవలం 600 ఎకరాల్లోనే నష్టం అంచనాలను రూపొందించారని రైతులు వాపోతున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



మోపిదేవిలంక గ్రామంలో 30 ఎకరాలు కౌలుకు వరి సాగు చేస్తున్నాను. ఇప్పటి వరకు లక్షల రూపాయలలో పెట్టుబడి పెట్టడం జరిగింది. తుఫాను కారణంగా వరి పంట పాలు పోసుకునే దశలో పూర్తిగా దెబ్బతినటం జరిగింది. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి పరిహారం నేరుగా కౌలు రైతులకు అందేలా న్యాయం చేయాలి.

-కొండేటి కృష్ణాంజనేయులు, మోపిదేవి కౌలు రైతు

చెన్నూరు పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణస్వీకారం

పెడన రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పీఏసీఎస్ పాలకవర్గం సోమవారం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా యర్రంశెట్టి దేవేంద్ర ప్రసాద్, సభ్యులుగా నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, దొండపాటి శివనాగరాజులతో సీఈవో గుడిశేవ బ్రహ్మయ్య ప్రమాణస్వీకారం చేయించారు. రైతుల సంక్షేమం కోసం సంస్థ పనిచేస్తుందని దేవేంద్రప్రసాద్ అన్నారు. జడ్పీటీసీ అర్జా నగేష్, ఉరివి సర్పంచ్ పంచకర్ల సురేష్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఊచా వెంకయ్య, వి.శ్రీనివాస్, బత్తిన హరిరామ్, నల్లమోతు రఘురాం, మోటేపల్లి సురేష్, సీఈవో బ్రహ్మయ్య రైతులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మోపిదేవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో జారీ పడి మేకా వెంకటేశ్వరరావు (65) మృతి చెందాడు. పెదప్రోలు పంచాయతీ శివారు శివరామపురంలో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం చెరువు దగ్గరకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీఆర్వో నాగమల్లేశ్వరరావు పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇంటింటికీ స్వదేశీ స్టిక్కర్

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాసనగర్‌లో బీజేపీ మండల సమావేశం సోమవారం జరిగింది. అధ్యక్షుడు కంచర్లపల్లి వెంటకరామారావు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఇంటా స్వదేశీ స్టిక్కర్లు పంపిణీ చేసి, సంతకాలు సేకరణ కార్యక్రమం మొదలు పెట్టారు. మండల ఇన్‌చార్జి పంతం వెంకట గజేంద్ర, మహిళా మోర్చా నాయకురాలు ఎస్.అమ్మాజీ, వేములపల్లి వెంకటరమణ, బొమ్మిడి నారాయణస్వామి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక దీపారాధన రేపు

మచిలీపట్నం టౌన్ : కార్తీకమాసం సందర్భంగా కొజ్జిలిపేట నాగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 5వ తేదీన సాయంత్రం 6 గంటలకు భక్తులచే సామూహిక దీపారాధన నిర్వహిస్తున్నట్టు టీటీడీ ధర్మప్రచార పరిషత్ అధికారి కల్యాణ శ్రీరామ్, ప్రతినిధి టి.ప్రసాద్ తెలిపారు. భక్తులకు ప్రమిదలు, వత్తులు, నూనె ఉచితంగా తామే ఇస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎంవీకేకు ఘననివాళి

అవనిగడ్డ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు సోమవారానికి 92వ రోజుకీ చేరాయి. మండలంలోని కూటమి నేతలు వెంక ట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నాగేశ్వరస్వామి దేవాలయంలో దీపారాధనలు



పెడన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



లింగాష్టకం పోటీల విజేతలతో దేసు సుబ్రహ్మణ్యం

మార్మోగిన శివనామం

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా కొజ్జిలిపేట నాగేశ్వరస్వామి, రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వరస్వామి, బచ్చుపేట మల్లేశ్వరస్వామి, సర్కిల్‌పేట శివాలయం, గొడుగుపేట శాంతామల్లేశ్వరస్వామి, ఈడేపల్లి జోడుగుళ్లు, మాచవరం శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో మహిళలు దీపారాధనలు చేశారు. **పెడన** : పవిత్ర కార్తీక మాసం రెండో సోమవారం గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకస్వాములు గూడూరు అగస్త్యేశ్వర శర్మ, శివదత్త ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. కొలుకుల గిరిజమనోహర్, పద్మశ్యామసునీత, మెట్ల కోటశివనాగకిరణ్‌కుమార్, లేఖ్య శిరీష దంపతులు స్వామి వారికి విశేష అలంకరణ చేయించారు. భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఈవో జి.వి. కృష్ణారావు, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బళ్ళ ప్రసాద్ పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. **చల్లపల్లి** : కార్తీక మాసం రెండో సోమవారం కావటంతో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. నడకుదురు పృధ్వీశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి స్వామివారికి అభిషేకాలు చేయించుకుని దీపారాధనలు చేశారు. చల్లపల్లి అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ఆవరణలో దీపారాధనలు చేశారు. లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు చేసి విశేష అలంకరణ చేశారు. అర్థనారీశ్వర రూపంలో విభూది, కుంకుమలతో చేసిన ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది. యాలుకల దండను వేసి సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. **అవనిగడ్డ** : కార్తీక సోమవార పర్వదినాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ రాజశేఖరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి వందలాదిగా తరలివచ్చిన భక్తులు విశేష పూజలు చేశారు. **అవనిగడ్డ రూరల్** : వేకనూరు ఉభయ ముక్తేశ్వరస్వామి దేవాలయంలో ఘంటసాల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ చిరువోలులంకలోని బాలశివశంకర్ భగవాన్‌కు సోమవారం కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారికి విశేష అభిషేకాలను ఆలయ నిర్వాహకులు గుడిసేవ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నసమారాధన జరిపారు.

కార్తీక పౌర్ణమికి విస్తృత ఏర్పాట్లు

కోడూరు : కార్తీక పౌర్ణమికి హంసలదీవిలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో సుధా ప్రవీణ్ అధ్యక్షతన కార్తీక పౌర్ణమి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. హంసలదీవికి 50 వేల మంది భక్తులు వస్తారని అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 72 మంది పోలీసులతో బందోబస్తు, 20 బోట్లు, 50 మంది గజ ఈతగాళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతి, వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దింటిమెరక నుంచి తిరుపతమ్మ గుడి వరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సంగమ ప్రదేశానికి భక్తులకు అనుమతి లేదన్నారు. తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఎస్సై చాణిక్య, పాలకాయితిప్ప మెరైన్ ఎస్ఐ పూర్ణ మాధురి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగాష్టకం పోటీలకు స్పందన

మచిలీపట్నం టౌన్ : కార్తీకమాసం సందర్భంగా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో విద్యార్థులకు నిర్వహించిన లింగాష్టకం, వేమన పద్యాల పోటీలకు మంచి స్పందన లభించింది. 82 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్లకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. విజేతలకు దేసు సుబ్రహ్మణ్యం, ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి, డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ బహుమతులు అందజేశారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ లింగం సులోచనారాణి

స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలు ప్రారంభం

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ అండర్ -14, అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలు గూడూరు హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. డీవైఈవో సింగ్, ఎంపీడీవోశైలజ, సర్పంచ్ సులోచనారాణి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణ, స్కూల్ ఇన్‌చార్జి యోహాను ప్రారంభించారు. 500 మంది బాలాబలికలు పోటీల్లో పాల్గొన్నట్లు డివిజనల్ ఇన్‌చార్జి బాబూరావు తెలిపారు.

మత్స్యకారుల చొరవ

● రామచంద్రాపురం వాసి సురక్షితం



అవనిగడ్డరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ చిరువోలులంక పుష్కర ఘాట్ వద్ద స్నానానికి వెళ్లి పడిపోయిన రామచంద్రాపురం గ్రామానికి చెందిన బచ్చు మురళీని వడుగువారిపాలెం మత్స్యకారులు కాపాడారు. చెరువుల దగ్గర కాపలా ఉండే వెంకన్న రేవు మధ్యలో మనిషి కనపడగానే వెను వెంటనే వడుగువారిపాలెం గ్రామస్థులకు సమాచారం అందించారు. మత్స్యకారులు రెండు బృందాలుగా ఏర్పడి పడవ సహాయంతో అతన్ని కాపాడి వారి బంధువులకు అప్పగించారు. స్పందించిన మత్స్యకారులను ప లువురు అభినందించారు. కొక్కిలిగడ్డ సత్తులబాబు, మోపిదేవి ప్రశాంత్, నడకుదుటి నరేంద్ర, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసరాలు

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన మల్లవోలు చేనేత కార్మికులకు సోమవారం నిత్యావసర వస్తువులు, బియ్యం, కందిపప్పు, పంచదార, మంచినూనె, బంగాళదుంపలు, ఉల్లిపాయలు పంపిణీ చేశారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు ప్రతి చేనేత కార్మికుడికి సాయం అందేలా కృషి చేసిన తహసీల్దార్ రాజ్యలక్ష్మికి చేనేత కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలియచేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతనస్వామి, అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన్ త్రినాథ్, కూనపరెడ్డి పెద్దిరాజులు, మల్లవోలు టీడీపీ అధ్యక్షుడు బాసంశెట్టి శ్రీనివాసరావు, పత్తిపాటి నరసింహస్వామి, పత్తిపాటి శ్రీనివాసరావు, అలుబాల, కడవకొల్లు రామయ్య, అలు నరసింహ, బత్తిన బుజ్జి, పిచ్చుక సుబ్రహ్మణ్యం, పిచ్చుక పార్థసారధి, వీఆర్వోలు వరప్రసాద్, ప్రసాద్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



సింగరాజు గోవర్దన్ దంపతులను సత్కరిస్తున్న శైవ మహాపీఠం ఉప పీఠాధిపతి దుర్గా మల్లికార్జునప్రసాద్

కులాలకతీతంగా లింగధారణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం శైవ మహాపీఠం ఆధ్వర్యంలో సోమవారం శంకరమఠంలో కులాలకతీతంగా లింగధారణ కార్యక్రమం నిర్వహించారు. శైవ మహాపీఠం అధ్యక్షుడు మల్లంపల్లి నాగలింగశాస్త్రి, కార్యదర్శి మల్లంపల్లి రవికుమార్, కోశాధికారి మారుతీ దివాకర్ పాల్గొన్నారు. గౌరవాధ్యక్షులు సింగరాజు గోవర్దన్, కల్యాణి దంపతులను పీఠం ఉపపీఠాధిపతి మల్లంపల్లి దుర్గా మల్లికార్జున ప్రసాద్ సత్కరించారు. చిన్మయ మిషన్ అధ్యక్షుడు బద్రి, రాజారత్నం, పి.వి.ఫణికుమార్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే కాగిత పూజలు

బంటుమిల్లి : పాశ్చాపురం సువర్చలాసమేత ఆంజనేయస్వామి పవిత్రోత్సవాల సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రత్యేక పూజలు జరిపారు. రామన్, నాగ బాబు, సంపత్‌కుమార్, రోహిత్ కుమార్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.